

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 18 అక్టోబరు 2024





ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో ఇడుపులపాయలో ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఐటీ పేదింటి బిడ్డలకు వరంగా మారింది. పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇంజనీరింగ్ చదువుకునే అవకాశం దక్కింది. ట్రిపుల్‌ఐటీల్లో చదువుకుని మల్టీనేషనల్ కంపెనీల్లో లక్షలాది వేతనంతో సాఫ్ట్‌వేర్ కొలువులు సాధించగా.. మరికొందరు గెజిటెడ్ ఆఫీసర్లుగా, ఐఏఎస్‌లుగా ఎంపికయ్యారు. దీంతో ట్రిపుల్‌ఐటీ ద్వారా ఆ కుటుంబాల్లో వెలుగులు నిండాయి. ఉన్నత సాంకేతిక విద్యను అందిస్తూ వేలాదిమందికి ఉన్నత ఉద్యోగాలు దక్కేలా చేస్తున్న ట్రిపుల్‌ఐటీ విజయగాథపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



ఆంధ్రజ్యోతి ప్రత్యేకం



పేదింటి బిడ్డలకు.. పెద్ద ఉద్యోగాలు

- ట్రిపుల్‌ఐటీలో చదివి ఐఏఎస్‌లుగా ఎంపిక
- మల్టినేషన్ కంపెనీల్లో లక్షల వేతనంతో సాఫ్ట్‌వేర్ కొలువులు
- పేదలకు వరంగా మారిన ట్రిపుల్‌ఐటీ విద్య

వేంపల్లె, అక్టోబరు 17: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008వ సంవత్సరంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో ఇడుపులపాయ, నూజివీడు, బాసరలో ట్రిపుల్‌ఐటీలను నెలకొల్పారు. ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమెరికాలోని కాగ్నిజెంట్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న రాజిరెడ్డిలు వినూత్నంగా ఆలోచించి ట్రిపుల్‌ఐటీలను రూపొందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వెయిటేజీ మార్కులిచ్చి ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ డిగ్రీని ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులంటే అధిక శాతం పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలే. ఒక్కో ట్రిపుల్‌ఐటీలో రెండువేల మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. రాష్ట్రం విడిపోయాక ఆంధ్రప్రదేశ్‌లో ఒంగోలు, శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలను నెలకొల్పారు. ఒక్కో ట్రిపుల్‌ఐటీలో వెయ్యి మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో 24,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికి విద్యాబోధనతో పాటు ఉచిత వసతి, భోజనం ఏర్పాటుచేశారు.

ప్లేస్‌మెంట్ విభాగం ఏర్పాటు

వినూత్న ఆలోచనలతో ప్రారంభమైన ట్రిపుల్‌ఐటీల్లో ప్రధానంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై అధిక ప్రాధాన్యత ఇచ్చి విద్యాబోధన సాగించారు. ల్యాప్‌టాప్‌ల ద్వారానే విద్యనందించారు. ఇక్కడ చేరిన విద్యార్థులకు ఉన్నత ఉద్యోగ అవకాశాలు రావాలన్న ఉద్దేశంతో ప్రత్యేక ప్లేస్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటుచేశారు. 2008లో ప్రారంభమైన ట్రిపుల్‌ఐటీ 2014వ సంవత్సరంలో ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు..

మిగతా 6వ పేజీలో..

మిజోరం డిప్యూటీ కమిషనర్‌గా శివగోపాల్‌రెడ్డి



ఈయన పేరు చీమల శివగోపాల్‌రెడ్డి. తండ్రి సాధారణ రైతు శివారెడ్డి. వీరిది కడప జిల్లా మైదుకూరు మండలం చిన్నయ్యగారిపల్లె. సాధారణ రైతు కుటుంబానికి చెందిన ఈయన 10వ తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు. 2012 నుంచి 2018 వరకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చదివి కెమికల్ ఇంజనీర్ అయ్యారు. 2019లో జపాన్‌లో ఉన్నత ఉద్యోగ అవకాశం వచ్చినప్పటికి వదులుకుని సివిల్స్‌కు ప్రిపేర్ అయి 2019 యూపీఎస్సీలో 263ర్యాంకు సాధించారు. కేంద్రపాలిత ప్రాంతాల కేడర్‌కు ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం మిజోరం రాష్ట్రంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ట్రిపుల్‌ఐటీలో చదివిన సాధారణ రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి ఐఏఎస్‌కు ఎంపిక కావడం ఆర్జీయూకేటీకి గర్వకారణమని అధికారులు చెబుతారు.

చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా విద్యాధరి



ఈమె పేరు గొబ్బిళ్ల విద్యాధరి. ఈమెది అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని నందలూరు. సాధారణ కుటుంబానికి చెందిన ఈమె 2008 నుంచి 2014 వరకు ట్రిపుల్‌ఐటీలో చదివి ఈసీఈ పూర్తిచేశారు. రెండేళ్ల క్రితం యూపీఎస్సీలో 211వ ర్యాంకు సాధించారు. ఈమె ప్రస్తుతం చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఆమెకు ట్రిపుల్ ఐటీలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించేందుకు కష్టపడి చదవడం వల్లే తనకు ఈ అవకాశం దక్కిందని అన్నారు.



ఇటీవల ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో న్యాక్ టెక్నాలజీకి రూ.6లక్షల వార్షిక వేతనంతో ఎంపికైన 82 మంది విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



వాల్మీకి జీవితం ఆదర్శనీయం

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని, ధర్మం, సత్యం, భక్తి వంటి విలువలకు నిదర్శనం రామాయణమని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. గురువారం స్థానిక రాయచోటిలోని కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా హాజరై వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నేడు మన సమాజానికి ధర్మం, సత్యం, భక్తి విలువలను తెలియజేసి రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి సందప్ప మాట్లాడుతూ హిందూ ఇతిహాస గ్రంథమైన రామాయణాన్ని 24 వేల శ్లోకాలతో, ఏడు కాండాలతో మహర్షి వాల్మీకి రచించారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణ, కలెక్టరేట్ ఏవో నాగభూషణం, వాల్మీకి సంఘ అధ్యక్షుడు భక్తవత్సలం, వాల్మీకి సేవాదళ్ అధ్యక్షుడు మూగిరెడ్డెప్ప, యోగానందబాబు, కురబలకోట చిన్నరెడ్డి బోయ తదితరులు పాల్గొని మహర్షి వాల్మీకీకి నివాళులు అర్పించారు.

మానవాళికి ఆదర్శం రామాయణ మహాకావ్యం

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతిఒక్కరూ జీవితంలో ముందుకు సాగాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామాయణ మహాకావ్యాన్ని సంకలనం చేసిన మహనీయులు వాల్మీకి మహర్షి రామాయణ మధుర కావ్యాన్ని యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా సమాజానికి అందించారన్నారు. మనిషిలో మార్పు వస్తే మహర్షి కాగలరని నిరూపించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన వాల్మీకి మహర్షి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఏవో కృష్ణుడు, ఆర్ఐ (అడ్మిన్) వీజే రామకృష్ణ, పోలీసు మోటారు వాహనాల అధికారి (ఆర్ఐ) ఎం.పెద్దయ్య, ఎస్‌బీ సీఐలు, టీవీ సత్యనారాయణ, శంకరయ్య, చలపతి, మహిళా పోలీసుస్టేషన్ సీఐ, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, డీపీవో సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుని రాసలీలలు

- సోషియల్ మీడియాలో వీడియో వైరల్

రాయచోటి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా రాసలీలల వీడియో బుధవారం అర్ధరాత్రి లీక్ అయింది. ఓ మహిళతో ఆయన సన్నిహితంగా ఉన్న ఈ వీడియో సోషియల్ మీడియాలో వైరల్ అయింది. వీడియోలో ఉన్న మహిళ ఇప్పటి వరకు ఎవరైందీ తెలియలేదు. తనకు ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తానని చెప్పి ఖాదర్‌బాషా లోబర్చుకున్నారంటూ ఆమె వీడియోలో ఆరోపించారు. తనకు ఖాదర్‌బాషా వల్ల ఇబ్బంది ఉందని అందులో పేర్కొన్నారు. అయితే ఈ విషయమై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. దీనిపై ఖాదర్‌బాషా మాట్లాడుతూ.. తాను ఏ తప్పూ చేయలేదని, కావాలనే కొందరు తనను ఇరికించారని అన్నారు.

వరద నీటితో ప్రవహిస్తున్న గుంజననది



రైల్వేకోడూరులో భారీ వర్షం

- గుంజన నదికి వరదనీరు

రైల్వేకోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మండలంలో గురువారం ఉదయం నుంచి తెరిపి ఇచ్చిన వర్షం ఒక్కసారిగా సాయంత్రం 6 గంటల నుంచి భారీగా కురుస్తోంది. ఉరుములు, పిడుగుల శబ్దాలతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దీంతో ఇటు రైతులు, అటు ప్రజలు ఆందోళన పడుతున్నారు. అధికారులు రైల్వేకోడూరులో ప్రజలను అప్రమత్తం చేశారు. ఎప్పుడు ఏమి జరిగినా వెంటనే చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. రెడ్డివారిపల్లె, నరసరాంపురం, ధర్మాపురం, శ్రీనివాసపురం, జానకీపురం, శెట్టిగుంట గిరిజన కాలనీ వద్ద ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వరద నీటితో గుంజననది ప్రవహిస్తోంది. అధికారులు ఆయా వరద ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పునరావాస ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఎక్కడికి పోకుండా ఉండాలని తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తెలిపారు. రైల్వేకోడూరులో పలు రోడ్లు జలమయమయ్యాయి.



రైల్వేకోడూరులో జలమయమైన అంకమ్మనగర్ వీధి రోడ్డు

జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా 'ఉల్లాస్'

- వందశాతం అక్షరాస్యత జిల్లాగా మార్చడమే ధ్యేయం
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానం-2020కి అనుగుణంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, జిల్లాను వంద శాతం అక్షరాస్యత కలిగిన జిల్లాగా మార్చడమే ధ్యేయమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారెడ్డి ఉల్లాస్ (సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యాసంపై అవగాహన) కార్యక్రమంపై వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. దేశంలో వందశాతం అక్షరాస్యతను సాధించేందుకు తీసుకువచ్చిన కేంద్ర కార్యక్రమం అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిర్వహించబోతున్నాయన్నారు. సమాజంలోని వివిధ వృత్తులలో ఉన్న 15 సంవత్సరాల పైబడిన వయోజనులను దృష్టిలో పెట్టుకుని తీసుకువచ్చిన కార్యక్రమం అన్నారు. ముఖ్యంగా ఎస్‌హెచ్‌జీ లబ్ధిదారులు, ఆయాలు, వంటవండేవారు, వివిధ రకాల సహాయకులు, వివిధ కార్యాలయాల కాపలాదారులు, తదితరులను అక్షరాస్యులుగా చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అన్నమయ్య జిల్లాను వందశాతం అక్షరాస్యత కలిగిన జిల్లాగా మార్చే దిశగా 13,767 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పాఠ్యప్రణాళిక పర్యవేక్షణ సిస్టంలను టీసీఎస్ సంస్థ ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఉచితంగా ప్రభుత్వానికి అందించిందని తెలిపారు. గ్రామాల్లో విద్యను అభ్యసించబోయే వారిని గుర్తించడానికి గ్రామ సహాయకులను ఎంపిక చేయాలని ఎంపిక చేసిన గ్రామ సహాయకులకు తగిన శిక్షణ ఇవ్వాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణకు సూచించారు. సమావేశంలో డీపీవో బాలకృష్ణారెడ్డి, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ఆలయం పగలగొట్టిన కేసులో ఆరుగురి అరెస్ట్

- జిలెటిన్ స్టిక్స్, కారు, పనిముట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ

రాయచోటిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు సమీపంలోని కనుగొండ ప్రాంతంలో గల అభయహస్త ఆంజనేయస్వామి దేవాలయాన్ని ఈనెల 14వ తేదీ రాత్రి పగలగొట్టిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ మీడియాకు వివరాలు వెల్లడించారు. తమ ఆధీనంలో ఉన్న అభయహస్త ఆంజనేయస్వామి దేవాలయాన్ని పగలగొట్టినట్లు ములకలచెరువు టౌన్‌లోని ఎంబీటీ రోడ్డులో నివాసం ఉంటున్న నరసింహులు కుమారుడు విద్యాసాగర్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా ములకలచెరువు సీఐ రాజారమేశ్, ఎస్ఐ గాయత్రిలు తమ సిబ్బందితో కలిసి గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ములకలచెరువు టౌన్‌లోని కదిరి రోడ్డులో గల అగ్రికల్చర్ చెక్‌పోస్టు వద్ద నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి కారుతో పాటు రెండు జిలెటిన్ స్టిక్స్, గడ్డపారలు, సుత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలియజేశారు. కనుగొండస్వామి దేవాలయంలో పూజారిగా ఉన్న హరినాధ్‌కు ఫిర్యాదుదారుడు విద్యాసాగర్‌కు మధ్య గత కొంతకాలంగా దేవాలయంలో జరిగే పూజల గురించి మనస్పర్థలు ఉన్నాయన్నారు. ఆలయాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుని వచ్చే ఆదాయాన్ని తానే పొందాలన్నా ఉద్దేశ్యంతో కొద్దిరోజులుగా ఆలయాన్ని తనకు వదిలేయాలని విద్యాసాగర్‌తో పూజారి గొడవపడుతుండేవాడన్నారు. దీనికి విద్యాసాగర్ ఒప్పుకోకపోవడంతో అతడిపై కక్ష పెంచుకున్న పూజారి హరినాధ్ గుడిని కూలగొట్టాలని పథకం వేశాడని తెలిపారు. గుడి కింద గుప్త నిధులు ఉన్నాయని దానిని పగులగొట్టాలని తనకు తెలిసిన మొలక మహేశ్వర్‌రెడ్డి, తిరుమణి లక్ష్మీనారాయణ, బుచ్చిపల్లి రాఘవేంద్రాచారి, చాకివేలు మధు, షేక్ ఇలాహిలతో కలిసి గుడిని పగులగొట్టించారని తెలిపారు. ఈ మేరకు ఆలయ పూజారి హరినాధ్‌తో పాటు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పెట్టినట్లు ఎస్పీ తెలియజేశారు. కార్యక్రమంలో మదనపల్లె డీఎస్పీ కొండయ్యానాయుడు, ములకలచెరువు సీఐ రాజారమేశ్, ఎస్ఐ గాయత్రి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

కల్యాణం నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు



వైభవంగా కోదండరాముడి కల్యాణం

ఒంటిమిట్ట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని గురువారం వైభవంగా టీటీడీ అర్చకులు నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణమండపం వద్ద నుంచి కల్యాణతంతును ప్రారంభించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం కంకణదారణ, యజ్ఞోపవితరణ అనంతరం మాంగల్యధారణను వైష్ణవ సంప్రదాయంలో సీతమ్మతల్లికి శ్రీరామచంద్రుని మాంగల్యధారణ చేశారు. తలంబ్రాల సమర్పణ, పూలచెండ్ల మార్పిడి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది వినోద్, అర్చకులు వీణా రాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిరాముడి పవిత్రోత్సవం

వాల్మీకిపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభిరామాలయంలో మూడు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. చివరిరోజు గురువారం ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చక్రస్నాన ఘట్టం వేడుకగా సాగింది. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. రాత్రికి ఏకాంత సేవతో పవిత్రోత్సవాలు ముగిశాయి. కార్యక్రమాలలో టీటీడీ ఏఈవో గోపినాథ్, డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, సూపరింటెండెంట్ మునిబాల, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



సీతారామలక్ష్మణుల నగరోత్సవం

పేదింటి బిడ్డలకు.. పెద్ద ఉద్యోగాలు

5వ పేజీ తరువాయి

● ట్రిపుల్ఐటీలో చదివి ఐఏఎస్‌లుగా ఎంపిక ● మల్టినేషన్ కంపెనీల్లో లక్షల వేతనంతో సాఫ్ట్‌వేర్ కొలువులు

క్యాంపస్ ఇటర్వ్యూలను ఏర్పాటుచేయించడమే ఈ ప్లేస్‌మెంట్ విభాగం లక్ష్యం. వివిధ కంపెనీలతో మాట్లాడి వారిని ట్రిపుల్ఐటీలకు పిలిపించి క్యాంపస్ సెలక్షన్లను ఏర్పాటుచేయించడంతో ప్రతిభ ఉన్న విద్యార్థులు పరీక్షల్లో పాల్గొని ఉద్యోగాలు పొందేవారు. వీలైనన్ని ఎక్కువ కంపెనీలను ట్రిపుల్ఐటీలకు రప్పించడం లక్ష్యంగా ఈ ప్లేస్‌మెంట్ విభాగం పనిచేస్తోంది.



ఇడుపులపాయ ట్రిపుల్ఐటీ క్యాంపస్ భవన సముదాయం



ల్యాప్‌టాప్‌ల ద్వారా విద్యనభ్యసిస్తున్న ట్రిపుల్ఐటీ విద్యార్థులు

ఇంజనీర్లుగా, గెజిటెడ్ ఆఫీసర్లుగా, ఐఏఎస్‌లుగా

ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో ఆరుసంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ చదివిన 11 బ్యాచ్‌లు బయటకు వెళ్లాయి. సుమారు 15,000 మంది విద్యార్థులు చదువుకున్నారు. వీరిలో చాలా మంది ఇంజనీర్లుగా ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో పనిచేస్తున్నారు. మల్టీనేషనల్ కంపెనీలైన అమెజాన్, టీసీఎస్, ఐబి, న్యాక్ టెక్నాలజీస్, హుండై, క్యూట్, జోరియంట్, ఇంటెల్, మ్యాపిల్ తదితర ఎన్నో కంపెనీలు చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా సెలెక్ట్ అయి ఉద్యోగాలు చేస్తున్నారు. కొందరు గెజిటెడ్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారు. కడప జిల్లా మైదుకూరు మండలం చిన్నయ్యగారిపల్లెకు చెందిన చీమల శివగోపాల్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా నందలూరుకు చెందిన విద్యాధరి ఐఏఎస్‌కు ఎంపికై డిప్యూటీ కమిషనర్, జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.

బయటకెళ్లాక మరింత మంచి వేతనాలు

ట్రిపుల్ఐటీల్లో చదువుకుంటూ క్యాంపస్ సెలక్షన్స్‌లో మల్టీనేషనల్ కపెనీలకు ఎంపికైన విద్యార్థులు లక్షల్లోనే వార్షిక వేతనం తీసుకుంటున్నారు. ఉద్యోగం చేస్తూనే కొత్తకొత్త కంపెనీల్లో ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించి మరింత మంచి వేతనం పొందే ఉద్యోగాలు పొందిన వారు చాలా మందే ఉన్నారని, ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో అకడమిక్ డీన్‌గా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్నకుమారి తెలిపారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఉద్యోగాలు పొందడంతో పాటు ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యనభ్యసించేందుకు వెళ్లినవారు ఉన్నారని అన్నారు.

వరంగా మారిన ట్రిపుల్ఐటీ విద్య

ట్రిపుల్ఐటీలు ముఖ్యంగా పేద, నిరుపేద కుటుంబాలకు వరంలాంటివని చెప్పవచ్చు. ట్రిపుల్ఐటీల్లో ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకే ప్రాధాన్యత ఇవ్వడంతో చాలా మంది కూలీలు, డ్రైవర్లు, రైతులు, ఇతర వర్గాల కుటుంబాల్లోని పిల్లలు ఇక్కడ చదువుకున్నారు. చాలా మంది విద్యార్థులు చక్కగా చదివి ఇంజనీర్లు అయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేయడం, మల్టీనేషనల్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ కొలువుల్లో చేరి లక్షలాది రూపాయలు వేతనాలు పొందడం ద్వారా ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగైంది.

బయట కంపెనీలకు అనుగుణంగా శిక్షణ

ప్రస్తుతం మార్కెట్‌లో కంపెనీలకు ఏయే అవసరాలు ఉన్నాయి అనే దానిపై అధ్యయనం చేసి విద్యార్థులకు వాటిపైనే శిక్షణ ఇస్తున్నాం. ప్లేస్‌మెంట్ సెల్‌ను మరింత బలోపేతం చేశాం. 24గంటలు నడిచే ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశాం. కోడింగ్, డీకోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై ఫైనలియర్‌తో పాటు మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గురించి పీయూసీ నుంచే శిక్షణ ఇస్తున్నాం. ట్రిపుల్‌లో ఐటీ చేరిన విద్యార్థులు బాధ్యతగా కష్టపడి క్రమశిక్షణతో చదువుకుంటే క్యాంపస్ సెలక్షన్ల ద్వారా, ఇతర మార్గాల ద్వారా ఉద్యోగాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- ప్రొఫెసర్ కుమారస్వామి గుప్త, డైరెక్టర్ ఇడుపులపాయ ట్రిపుల్ఐటీ

ఎక్కువమందికి ఉద్యోగ కల్పనే లక్ష్యం

ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో చేరిన అందరు విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రత్యేక స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాంను వినూత్నంగా పీయూసీ నుంచే మొదలుపెడుతున్నాం. మద్రాస్ ఐఐటీతో ఒప్పందం చేసుకున్నాం. టాటా కోడింగ్, అనలాజికల్ ఇంటలిజెన్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఫైనలియర్ విద్యార్థులతో పాటు కొత్తగా మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సెకెండ్ సెమిస్టర్ నుంచే ఇంటర్వ్యూలో ఎలా పాల్గొనాలి, పరీక్షలు ఎలా రాయాలి అనే వాటిపై శిక్షణ ఇస్తున్నాం. తద్వారా వీలైనంత ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఆర్జీయూకేటీ లక్ష్యంగా పనిచేస్తున్నాం.

- ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సంద్ర, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ



ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో చేర్పించేందుకు పిల్లలను పిలుచుకెళ్తున్న తల్లిదండ్రులు



ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో చేరేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎంపికైన విద్యార్థులు



మల్టీనేషనల్ కంపెనీకి ఎంపికైన ఇడుపులపాయ ట్రిపుల్ఐటీ విద్యార్థులతో ట్రిపుల్ఐటీ అధికారులు

వందలాది మందికి ఉద్యోగాలు

ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో చదివిన పేద, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల వారికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. క్యాంపస్ సెలక్షన్ల ద్వారా ఉద్యోగాలు రాగా చదువు పూర్తయి బయటకు వెళ్లాక పలువురు విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. ఇప్పటి వరకు ఇడులపాయ ట్రిపుల్ఐటీలో వివిధ కంపెనీల్లో క్యాంపస్ సెలక్షన్ల ద్వారా ఎంపికైన విద్యార్థుల వివరాలు, వారు పొందిన వార్షిక వేతనాలు వివరాలు..

బ్యాచ్	ఉద్యోగాలకు ఎంపికైనవారు	వార్షికవేతనం రూ.లక్షల్లో
2008	365	16
2009	292	13
2010	288	13.20
2011	244	8.20
2012	264	7.20
2013	290	14.93
2014	299	14
2015	306	24
2016	560	17.30
2017	396	12
2018	425	14

ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాధాకృష్ణ



రాయచోటిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి.రాధాకృష్ణను ఎన్నుకున్నారు. బుధవారం అమరావతిలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగానే రాయచోటి పట్టణంలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రభుత్వంతో చర్చించి ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్‌సీ, ఐఆర్‌జీవో 117, సీపీఎస్ రద్దు, బదిలీలు, పదోన్నతుల సాధనకు కృషి చేస్తామని తెలిపారు.

కొండ మీద పిడుగు



పిడుగుపడడంతో అక్కమలకొండ మీద చెలరేగిన మంటలు

చిన్నమండెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలంలోని బోరెడ్డిగారిపల్లెకు సమీపాన ఉన్న అక్కమలకొండమీద గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో కురిసిన వర్షానికి పిడుగుపడడంతో కొండమీద మంటలు చెలరేగాయి. అయితే బోరెడ్డిగారిపల్లెకు కాస్త దూరం ఉండడంతో ఎలాంటి నష్టం జరగలేదు. అదే కాస్త ఇటు అయ్యుంటే పల్లెలోనే పడిందేదని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ పరిసర ప్రాంతాల్లో ఎవరు జనాలు లేకపోవడంతో ఎలాంటి నష్టం జరగలేదు.

శభాష్.. తేజశ్విని.. చంద్రబాబు ప్రశంస



సీఎం చంద్రబాబుతో సీఎం ర్యాంకర్ తేజశ్విని

తంబళ్లపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబంలో పుట్టి కృషి, పట్టుదలతో చదివి సీఏ, సీఎంఏలో ఆలిండియా ర్యాంకు సాధించిన రైతు బిడ్డ తేజశ్వినిని సీఎం చంద్రబాబునాయుడు ప్రశంసించారు. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన కె.రఘురాంరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె తేజశ్విని తల్లితండ్రుల కష్టాన్ని చూస్తూ చిన్నతనం నుంచే చదువులో ప్రతిభ కనపరిచేది. ప్రాథమిక విద్య తంబళ్లపల్లెలో పూర్తి చేసి జవహర్ నవోదయలో సీటు సాధించింది. సీఏ చేయాలనే లక్ష్యంతో గుంటూరు మాస్టర్ మైండ్స్‌లో చేరి కృషి, పట్టుదలతో చదివి ఈ ఏడాది జూలై 11న విడుదలైన సీఏ ఫైనల్ ఫలితాల్లో 455 మార్కులతో ఆలిండియా 14వ ర్యాంకు సాధించింది. అంతేకాకుండా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆగస్టు 23న విడుదల చేసిన సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ) ఫలితాల్లో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, మాస్టర్ మైండ్స్ యాజమాన్యం ఆహ్వానం మేరకు బుధవారం సాయంత్రం తేజశ్విని తండ్రి రఘురాంరెడ్డి, చిన్నాన్న అమర్‌నాథరెడ్డితో కలసి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సీఎం తేజశ్వినిని అభినందించారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో

నందలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కొండయ్య మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అధిక వర్షపాతం కారణంగా రవాణాకు దూరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.

గర్భిణులను గుర్తించి వారిని కాన్పుల కోసం దగ్గరలోని వారికి ఇష్టమైన ఆసుపత్రుల్లో చేర్పించాలని సూచించారు. అలాగే షుగర్, బీపీ, తీవ్రమైన జబ్బులతో బాధపడుతున్న వారిని గుర్తించి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించాలన్నారు. వర్షం తగ్గిన తర్వాత లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండి మలేరియా, డెంగ్యూ జ్వరాలు, విరేచనాలు ప్రబలేందుకు అవకాశం ఉందని కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆశాలకు, మహిళ ఆరోగ్య కార్యకర్తలకు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, విశ్వనాథ్, సీహెచ్‌వో వెంకటనారాయణ, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ తడుస్తోంది...

● కలెక్టర్ ఛాంబర్‌లో లీకేజీ ● ప్రతి రూములోనూ ఇదే పరిస్థితి
● మరమ్మతులు చేయడానికి నిధులు లేవంటున్న ఆర్అండ్‌బీ



కలెక్టర్ ఛాంబర్ ముందు వర్షపు నీటిని తుడుస్తున్న దృశ్యం

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటు చేసిన కలెక్టరేట్ భవనాలు కొద్దిపాటి వర్షానికి తడిసి ముద్ద అవుతున్నాయి. అప్పటి ప్రభుత్వం జిల్లాలు ఏర్పాటు చేస్తూ బాలుర గిరిజన గురుకుల పాఠశాలను కలెక్టరేట్ కార్యాలయంగా ఏర్పాటు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అయితే అందుకోసం దాదాపు రెండు కోట్ల రూపాయలు వెచ్చించి భవనాలను అనుకూలంగా మార్చి కలెక్టరేట్‌గా ఏర్పాటు చేసుకున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కలెక్టరేట్‌లోని అన్ని భవనాలు తడిసి ముద్దవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో కూడా నీళ్లు కారడం, అలాగే ముఖ్యమైన సెక్షన్లలో కూడా వర్షపు నీరు రావడం ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ఇబ్బందికరంగా ఉందని తెలిసింది. గతంలో ఉన్న కలెక్టర్ కూడా ఇలాగే వర్షం పడినపుడు కారుతూ ఉంటే బిల్డింగుపైన ప్లాస్టింగ్ చేయించారని, అయినప్పటికీ కూడా మళ్లీ వర్షాలు వస్తే అక్కడక్కడా కారుతోందని సిబ్బంది చెబుతున్నారు. మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాల్‌కు పీయూపీ చేయడం వల్ల నీరు కారణం కనిపించలేదు. పీయూపీ లేని పక్షంలో ఆ బిల్డింగులు కూడా వర్షపు నీరు వచ్చే ప్రమాదం ఉందని కొంతమంది ఉద్యోగులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా కొత్త జిల్లాలపై శ్రద్ధ పెట్టి భవనాలకు మరమ్మతులు చేస్తే బాగుంటుందని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ విషయంపై కలెక్టరేట్ ఏవో నాగభూషణంను వివరణ కోరగా వర్షం ఆగిన తర్వాత కలెక్టరేట్ భవనంలో ఎక్కడెక్కడ లీకేజీలు ఉన్నాయో వాటికి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.



స్లాబ్ నుంచి కారుతున్న వర్షం నీళ్లు

పింఛా ప్రాజెక్టును పరిశీలించిన అధికారులు



పింఛా ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

సుండుపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పింఛా సమీపంలో ఉన్న యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి ప్రాజెక్టును ఇరిగేషన్ ఈఈ వెంకట్రామయ్య గురువారం పరిశీలించారు. పింఛా ప్రాజెక్టులోకి పై ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీరు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షం అధికంగా పడితే పై ప్రాంతాల్లో పాటు అటవీ ప్రాంతం నుంచి ఎక్కువ నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయని అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి నీటి సామర్థ్యాన్ని చెక్ చేయాలన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 164 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రాజెక్టు దిగువ భాగంలో నది పరీవాహక ప్రాంతాల్లోకి ప్రజలను ఎవరిని వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ చెంగల్‌రాయుడు, ఏఈ నాగేంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నందలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందలూరు, నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ ఉద్యాన పంటలను రాజంపేట ఉద్యాన అధికారి సురేష్‌బాబు, మండల వ్యవసాయాధికారి జి.మల్లికార్జున గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయాధికారి మల్లికార్జున మాట్లాడుతూ అధిక వర్షాలకు వరి పొలాల్లో నిలబడిన నీటిని ప్రత్యేక కాలువల ద్వారా వెంటనే బయటికి పంపాలని తెలిపారు. నేలకొరిగిన వరి పైరును కట్టలుగా కట్టి నిలబెట్టుకోవాలి. అలాగే కోత కోసి నిల్వ ఉంచిన వరికుప్పలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు మాట్లాడుతూ ఉద్యాన పంటలైన అరటి, నిమ్మ, పసుపు, బొప్పాయ పంటల్లో తేమ ఆరిన తరువాత 13.0.45 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో షణ్ముఖ్, వీహెచ్‌ఏ వరున్, రైతులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి వాసి బెంగళూరులో దారుణ హత్య

● వివాహేతర సంబంధమే కారణం



బాలాజి (ఫైల్)

నిమ్మనపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కారణంగా నిమ్మనపల్లి వాసి బెంగళూరులో స్నేహితుడి చేతిలో దారుణ హత్యకు గురైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ గుండ్లబురుజు దళితవాడకు చెందిన బాలాజీ (24) ఉపాధి నిమిత్తం మూడేళ్లుగా బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తుండేవాడు. అయితే రామసముద్రం మండలానికి చెందిన రెడ్డెప్పరెడ్డితో స్నేహం ఏర్పడింది. కాగా రెడ్డెప్పరెడ్డి తన భార్య పిల్లలతో బెంగళూరులోని దొడ్డనహళ్లిలో కాపురం ఉంటున్నాడు. బాలాజీ అప్పడప్పుడు రెడ్డెప్పరెడ్డి ఇంటికి వెళుతూ అతడి భార్యతో పరిచయం పెంచుకున్నారు. వారి పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం రెడ్డెప్పరెడ్డికి తెలియడంతో ఎలాగైనా బాలాజీని చంపాలని పథకం వేశాడు. ఈ క్రమంలో తన భార్య పిల్లలను రామసముద్రంకు పంపించి బాలాజీని ఆదివారం తన ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం ఇద్దరూ మద్యం తాగి ఆ మత్తులో బాలాజీని దారుణంగా హత్య చేశాడు. వెంటనే ఇంటి తలుపులు వేసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. నిమ్మనపల్లి నుంచి బాలాజీ తండ్రి రమణ, తల్లి నాగమ్మలు ఫోన్ చేసినా తీయకపోవడంతో అనుమానం వచ్చి బెంగళూరులోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా బాలాజి చనిపోయి ఉండటాన్ని గమనించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

దీంతో గురువారం బాలాజీ మృతదేహాన్ని గుండ్లబురుజుకు తరలించారు. అయితే ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు భోరున విలపించారు. దీనిపై బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తెగుళ్లు..ఆపై వర్షం దెబ్బ..



వాల్మీకిపురం వద్ద వర్షానికి దెబ్బతిన్న టమోటా పంట

● టమోటా, వంకాయ నేలపాలు

వాల్మీకిపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా కురుస్తున్న వర్షం రైతులను తీవ్ర నష్టాలకు గురి చేస్తోంది. వాల్మీకిపురం సమీపంలో రైతు శేఖర్ సుమారు పదిఎకరాలకుపైగా టమోటా, వంకాయ, బొప్పాయి, మునగ తోటలను పదిలక్షలు వెచ్చించి సాగు చేశాడు. టమోటా వర్షంతో దెబ్బతిని రాలిపోతుండటం, వంకాయకు కుళ్లు తెగుళ్లు, మునగకు బంక తెగుళ్లతో పూత మొత్తం రాలిపోవడం, ఉన్న అరాకొర రాయలు కూడా నలుపు రంగులోకి తిరిగి తీవ్ర నష్టం వాటిల్లింది. బొప్పాయి పంట వ్యాపారులు రాకపోవడంతో కాయలను తోటల్లోనే వదిలేశారు. ఆరుగాలం శ్రమించి పంటలు సాగుచేస్తే ఇలా తెగుళ్లు, వర్షం దెబ్బకు నష్టపోతున్నామని, కనీసం కూలీలు కూడా గిట్టుబాటు కాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని శాఖంవారిపల్లెకు చెందిన వెంకటరమణనాయుడు రూ.14లక్షలు ఖర్చు చేసి నాలుగు ఎకరాలలో టమోటా పంట సాగుచేస్తే కోతకొచ్చిన సమయాన వర్షం దెబ్బకు టమోటాలు పగుళ్లు వచ్చి రాలిపోతుండటంతో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక భోగంపల్లె సమీపంలో రైతు రమణారెడ్డికి చెందిన వరిపైరు వర్షం దాటికి దెబ్బతిని నష్టం వాటిల్లింది. తుఫాను వర్షం కారణంగా మండలం వ్యాప్తంగా పంటలకు నష్టం వాటిల్లింది.



కూలీలు కూడా రావడం లేదు..


లక్షలు ఖర్చు చేసి పంటలు సాగుచేస్తే పంట చేతికొచ్చే సమయాన తెగుళ్లతో మందుల భారం ఎక్కువవుతోంది. పదిఎకరాలకు పైగా టమోటా, వంకాయ, బొప్పాయి, మునగ పంటలు సాగుచేశాను. రెండు రోజులుగా పంటలన్నీ నష్టమే. ఉన్న అరాకొర పంట కోసి మార్కెట్‌కు తీసుకెళ్తే కనీసం కూలీలు కూడా గిట్టుబాటు కావడం లేదు. నష్టాలలో కూరుకుపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

-శేఖర్, రైతు, వాల్మీకిపురం.



దెబ్బతిన్న టమోటా పంట చూపుతున్న రైతు వెంకటరమణనాయుడు

బురకాయలకోట సీతాఫలం... రుచి మధురం



ఈ ప్రాంతంలోని అడవులు, కొండలు, గుట్టల్లో సీతాఫలం చెట్లు పెద్దఎత్తున ఉన్నాయి. ఇక్కడ సహజ సిద్ధంగా స్వచ్ఛమైన వాతావరణంలో పండే ఈ సీతాఫలాలు ఎంతో మధురంగా ఉంటాయి. వీటికి ఎలాంటి రసాయనాలు, పురుగుల మందులు వాడరు. దీంతో బురకాయలకోట సీతాఫలంకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి సీతాఫలం కాయలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. దీంతో కూలీలకు ఉపాధితో పాటు వ్యాపారులు మంచి ఆదాయం పొందుతున్నారు.

- సహజ సిద్ధంగా కాపు.. మంచి డిమాండ్
- ఇతర రాష్ట్రాలకు తరలింపు
- కూలీలకు ఉపాధి.. వ్యాపారులకు ఆదాయం

ములకలచెరువు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు మండలం బురకాయలకోట, దేవళచెరువు, సోంపాళ్యం, కాలువపల్లె, నల్గొండ, బి.కొత్తకోట మండ లం హార్సిలీహిల్స్, గట్టు, తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె, ముద్దలదొడ్డి, పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు, బి.కొత్తకోట మండలం బయప్పగారిపల్లె, ఉలవలవారిపల్లె, కురబలకోట మండలాల గ్రామాల సమీపాల్లో అడవులు, కొండలు, గుట్టలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ సీతాఫలం చెట్లు వేలల్లో ఉన్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో సీతాఫలం కాయలు కాస్తాయి. ఈ ప్రాంతాల నుంచి కూలీలు కాయలను కోసుకొచ్చి బురకాయలకోటలో విక్రయానికి తీసుకొస్తారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు, నల్లచెరువు, సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం బాగేపల్లె, చేలూరు తదితర ప్రాం తాల నుంచి కూడా కాయలను కోసుకొచ్చి విక్రయించడానికి కూలీలు ఇక్కడికి తెస్తున్నారు. ఆగస్టు నుంచి నవంబరు ఆఖరు వరకు సీజన్ నడుస్తుంది. ఇక్కడ కూలీల దగ్గర నుంచి సీతాఫలం కాయలను వ్యాపారులు కొనుగోలు చేసి వాటిని గ్రేడింగ్ చేసి రాష్ట్రంలోని గుంటూరు, విజయవాడ, కర్నూల్, రాజమండ్రి, అనంతపురం నంద్యాల, విశాఖపట్నం తదితర పట్టణాలకు తరలి స్తారు. అలాగే తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు, మిర్యాలగూడ,మహబూబ్‌నగర్, సిరిసిల్ల, కరీంనగర్, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, రాయచూర్, గుల్బర్గా, సిందనూరు, హొస్పేట్, హుబ్లీ, బళ్లారి, మహారాష్ట్ర రాష్ట్రం సోలాపూర్, తమిళనాడు రాష్ట్రం చెన్నై, కోయంబత్తూరు ప్రాంతాలకు ఎగుమతి చేసి విక్రయిస్తుంటారు.

కూలీలకు జీవనోపాధి

ప్రతి ఏడాది సీతాఫలం కాయలతో ఈ ప్రాంతాల్లోని కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఆగస్టు నుంచి నవంబరు నెల వరకు సీతాఫలం కాయలు కోసుకొచ్చి ఇక్కడి తెచ్చి విక్రయిస్తారు. కూలీలు ప్రతి రోజు ఉదయమే అడవులు, కొండలు, గుట్టలకు వెళ్లి కాయలు సేకరించి సాయంత్రం బురకాయలకోటకు తీసుకొచ్చి వ్యాపారస్థులకు విక్రయిస్తారు. వ్యాపారులు కూలీల వద్ద నాణ్యతను బట్టి ఒక్కో క్రేట్‌ను రూ.400 నుంచి రూ.600 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో కూలీ ప్రతి రోజు రెండు నుంచి మూడు క్రేట్ల కాయలు సేకరించి అమ్మకానికి తీసుకొచ్చి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు సంపాదిస్తున్నారు. గతంలో ఇక్కడి నుంచి ప్రతి రోజూ 2వేల క్రేట్ల వరకు ఎగుమతి అయ్యేవి. కాగా కాయలు సైజులు వచ్చే సమయంలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో నెలకొన్న వర్షాభావం కారణంగా కాయలు సైజులు లేకపోవడంతో ప్రతి రోజూ 600 క్రేట్ల వరకు కాయలు ఎగుమతి అవుతున్నాయి.



బురకాయలకోట నుంచి ఎగుమతి చేసేందుకు క్రేట్లలో సిద్ధం చేసిన సీతాఫలం కాయలు



జీవనోపాధి దొరుకుతోంది

సీతాఫలం కాయల ద్వారా ప్రతి ఏటా జీవనోపాధి లభిస్తోంది. మా ఊరికి సమీపంలో ఉన్న కొండలు, గుట్టల్లోకి వెళ్లి ప్రతిరోజూ రెండు క్రేట్ల కాయలను కోసుకొచ్చి ఆటో బాడుగకు మాట్లాడుకుని బురకాయలకోటకు తీసుకొచ్చి అమ్ముకుంటున్నాం. వర్షాలు బాగా కురిసి కాయలు బాగా కాస్తే మంచి ఉపాధి దొరుకుతుంది.

- రామలక్ష్మమ్మ, కూలీ, బురకాయలకోట

ఇష్టంగా తింటారు

సహజ సిద్ధంగా కాచే ఇక్కడి సీతాఫలం కాయలను ఇష్టంగా తింటారు. ప్రతిరోజూ రెండు బాక్సుల కాయలు కోసుకొచ్చి రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నాను. అయితే ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షం కురవక సీతాఫలం కాయలు సైజు రాలేదు. దీంతో కాయల దిగుబడి తగ్గింది.



- మునెమ్మ, కూలీ, బురకాయలకోట

వరద ప్రభావిత ప్రాంతాలలో సబ్ కలెక్టర్ పర్యవేక్షణ



పునరావాస కేంద్రంలో వరద బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

రైల్వేకోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల నుంచి రైల్వేకోడూరులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముందు జాగ్రత్త చర్యగా రాజంపేట సబ్ కలెక్టర్ నిధియాదేవి బుధవారం అర్ధరాత్రి వరకు రైల్వేకోడూరులోనే తిష్ఠ వేసి వరద ప్రభావిత ప్రాంతాలలో పరిస్థితులను పర్యవేక్షించారు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందితో కలసి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కాగా, సబ్ కలెక్టర్ ఆదేశాల ప్రకారం రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తమ సిబ్బందితో ఐదు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి బుధవారం సాయంత్రం వరద బాధితులను తరలించి.. రాత్రి భోజనాలు తగిన వసతులను ఏర్పాటు చేయించారు. గురువారం ఉదయం, మధ్యాహ్నం మళ్లీ వర్షాలు కురుస్తాయనే ఉద్దేశ్యంతో ముందుస్తుగా పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు అల్పాహారాలు, భోజనాలు ఏర్పాటు చేయించారు.

గండికోటకు 3వేల క్యూసెక్కుల వరదనీరు

కొండాపురం/ మైలవరం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండురోజులగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల ద్వారా గండికోట పాజెక్టులోకి గురువారం 3వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా అవుకు రిజర్వాయిర్ నుంచి మరో 4300 క్యూసెక్కుల కృష్ణాజలాలు ప్రాజెక్టులోకి వస్తున్నాయన్నారు. ఇప్పటికే ప్రాజెక్టులో తగినంత నీటిమట్టం ఉండటంతో గేట్లు ఎత్తి మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. కాగా, మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి నీటి విడుదల కొనసాగుతుంది. గురువారం గండికోట జలాశయం నుంచి 7,500 క్యూసెక్కుల నీరు వచ్చి మైలవరంలో చేరుతుండటంతో పెన్నానదికి 8 వేల క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 25 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జలాశయ నరసింహమూర్తి తెలిపారు. మైలవరానికి గండికోట నుంచి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి వదిలే అవకాశం ఉందని పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న మిషన్ వాత్సల్య శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టరు

కడప నాగరాజుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శిక్షణ కార్యక్రమాలతో క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించవచ్చని మిషన్ వాత్సల్య శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టరు ఎ.విజయ పేర్కొన్నారు. గురువారం కడప డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో కర్నూలు రీజియన్‌లోని కడప, కర్నూలు, చిత్తూరు, నంద్యాల, అన్నమయ్య, తిరుపతి, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలలో కొత్తగా నియామకం అయిన మిషన్ వాత్సల్య సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలకు హాజరై శిక్షణ పొందడం వల్ల మనకు తెలియని చాలా విషయాలు తెలుసుకోవచ్చన్నారు. వివిధ జిల్లాల అనుభవాలను చర్చించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలో తెలుసుకోవచ్చన్నారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రోహిణి, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి, ప్రోగ్రాం మేనేజరు కమల్‌కుమార్, వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్



అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో గురువారం పోస్టుగ్రాడ్యుయేషన్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం అయ్యాయి. ప్రవేశాలకు విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. 25 కోర్సులకు ఏపీ పీజీ సెట్ 2024 అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను డాక్టర్ రామక్రిష్ణ, డాక్టర్ గణేశ్‌నాయక్ పరిశీలించారు. ఈ ప్రవేశాలు ఈనెల 1వ తేదీ వరకు కొనసాగుతాయని ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ తెలిపారు.

డ్రాగా ముగిసిన అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు

కడప(స్పోర్ట్స్), అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 మెన్స్ మల్టీడే రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా గురువారం వివిధ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌లు వర్షం కారణంగా డ్రాగా ముగిశాయి. ఓ మ్యాచ్ పూర్తిగా ఆట సాగలేదు. వివరాలిలా....

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-విశాఖ జట్ల మధ్య సాగిన రెండవ రోజు ఆటలో వర్షం కారణంగా మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించారు. దీంతో టాస్ నెగ్గిన కడప జట్టు ఫీల్డింగ్ చేయగా బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 39 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేసింది. ఇందులో రామ్‌చరణ్ 80 పరుగులు, వినోద్, 52, ధమన్‌రెడ్డి 51 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 98 పరుగులు మాత్రమే చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అలాగే కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో గురువారం ఈస్ట్‌గోదావరి- వెస్ట్ గోదావరి జట్ల మధ్య సాగిన మ్యాచ్ వర్షం కారణంగా 25 ఓవర్లకు కుదించారు. టాస్ నెగ్గిన ఈస్ట్ గోదావరి జట్టు తొలుత బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 127 పరుగులు సాధించింది. ఇందులో కార్తీక్ 65 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు 25 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. ఇక కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రకాశం-కర్నూలు జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. 16, 17 తేదీలలో (బుధ, గురువారం) వర్షం కారణంగా ఆట సాగలేదు.



వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్



80 పరుగులు సాధించిన రామ్‌చరణ్, 65 పరుగులు చేసిన కార్తీక్

అందరికి అందుబాటులో ఇసుక : ఇన్‌చార్జి కలెక్టర్

పెండ్లిమర్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త గంగిరెడ్డిపల్లె గ్రామంలో ఇసుక క్వారీని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడ ఎలాంటి లోపాలు జరగకుండా సంబంధిత అధికారులు ప్రజలకు ఇసుకను అందేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా అందరికి అందుబాటులోకి ఇసుకను తీసుకొచ్చామన్నారు. మండలంలోని కొత్త గంగిరెడ్డిపల్లె, మాచునూరు, కొండూరు, నందిమండలం గ్రామాల పరిధిలోని పాపాఘ్ని నదిలో ఇసుక రీచ్‌లను ఏర్పాటుచేశామన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, కూటమి ప్రభుత్వంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుడా ప్రజలందరికి అందుబాటులో ఇసుక పాలసీని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర అధికారులు, టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఇసుక లోడింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, కొబ్బరికాయ కొట్టి ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

శిక్షణ తరగతులు రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : 1, 2తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించడాన్ని రద్దు చేయాలని ఎస్టీఎఫ్ జిల్లాగౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం కడప ఎస్టీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు అక్టోబరు 21 నుంచి 26 వరకు ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో రాష్ట్రంలో 9 కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం వల్ల ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థులు బోధనకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఈ శిక్షణను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు రాజగోపాలరెడ్డి, క్రిష్ణఫర్‌జాన్, ప్రసాద్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రవిశంకర్ పాల్గొన్నారు.

మేకల కాపరి అదృశ్యం

అట్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలువాండ్లపల్లె గ్రామానికి చెందిన సొంట గంగిరెడ్డి నాలుగు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. అడవిలో మేకలను మేపుకోవడానికి వెళ్లి కనిపించకుండా పోయాడు. గురువారం కలవాండ్లపల్లె వరికుంట ఎస్సీ కాలనీ, బీసీ కాలనీవాసులు సుమారు 80 మంది బృందాలుగా ఏర్పడి అడవిలో వెతికినా గంగిరెడ్డి ఆచూకీ తెలియలేదు. దీంతో బద్వేలు నుంచి డ్రోన్ కెమెరాలు తెప్పించి ప్రయోగించిన గంగిరెడ్డి ఆచూకీ లభించలేదు. ఈ మేరకు భార్య ఓబులమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె రామిరెడ్డిలేవుట్‌లో నివశిస్తున్న రియాజ్ బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. ఇతను ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. 2011లో తాసీజ్‌భానుతో వివాహం అయింది. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ విషయమై భార్య భర్తలు గొడవపడ్డారు. సోమవారం భర్తపై అలిగి పుట్టింటికి తమ పిల్లలను తీసుకుని భార్య వెళ్లిపోయింది. ఆమె తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన రియాజ్ ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. అలకతీరిన భార్య తిరిగి గురువారం ఇంటికి వచ్చి చూడగా.. భర్త మృతి చెందిన విషయం వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

బి.కొత్తకోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లె అటవీప్రాంతంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడు నాగరాజు(52) వాల్మీకిపురం టౌన్ సమాజుకట్ట వీధికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కూలీపనుల నిమిత్తం బి.కొత్తకోట ప్రాంతానికి వచ్చిన నాగరాజు స్థానికంగా నివాసం వుంటూ ఒంటరిగా జీవనం సాగించేవాడు. ఈనేపథ్యంలో గుడిపల్లి వద్ద చెట్టుకు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఇతని మృతికి దారితీసిన కారణాలు తెలియాల్సి వుందని బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 17: మదనపల్లె పట్టణం, ఈస్ట్ కొత్తపేటలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. గురువారం ఏభైఐదేళ్ల కలిగిన గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉండడానికి గుర్తుంచిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అనంతరం పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చనిపోయి వ్యక్తి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు మున్సిపల్ టీచర్లుకు కూడా కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్ బాబు తెలిపారు. గురువారం కడప డీఈవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో ఇప్పటికీ తగినంత సబ్జెక్టు టీచర్లు లేరని, 3, 4, 5 తరగతులను విలీనం చేశారు తప్ప ఆ తరగతులు బోధించడానికి స్కూలు అసిస్టెంట్లను ఇవ్వలేదన్నారు. పదోన్నతులు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదన్నారు. ఎప్పుడు నిర్వహిస్తారో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం పంచాయతీరాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఈవో పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఈవో అనురాధకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శులు సీవీ రమణ, ఎజాజ్ హ్మద్, నాయకులు ప్రభాకర్, రూత్ ఆరోగ్యమేరీ, క్రిష్టారెడ్డి, మేరీ ప్రసన్న పాల్గొన్నారు.

పబ్లిక్ అండ్ హెల్త్ ఈఈగా జె.రమణమూర్తి



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప కార్పోరేషన్ పబ్లిక్ అండ్‌హెల్త్ ఈఈగా జె.రమణమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాశ్వత నీటి పరిష్కారానికి బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు నుంచి కడప బండికనుమ వరకు 55 కి.మీ మేర పైపులైను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కడప కార్పోరేషన్ నిధులు రూ.540 కోట్లతో ఈప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు.

ఇసుకరీచ్‌ను పరిశీలించిన సబ్‌కలెక్టర్


ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

నందలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన నూతన ఇసుక రీచ్‌ను రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోం నిధియాదేవి గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఆమె ఇసుక రీచ్‌కు సంబంధించిన హద్దులను ఏర్పాటు చేశారు. ఇసుక రీచ్ యజమానులు నియమ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీనరసయ్య, సర్పంచ్ మైనుద్దీన్, చుక్కా యానాది, తహసీల్దారు అమర్‌నాథ్, ఎంపీడీవో సుజాతమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ

రాయచోటిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహన దారుడు రవాణాశాఖ నిబంధనలతో పాటు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన రాయచోటి ట్రాఫిక్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణ వాహనదారులు ట్రాఫిక్ పోలీసు వారి హెచ్చరికలను దృష్టిలో పెట్టుకొని నడుచుకోవాలన్నారు. రాయచోటి పట్టణంలో వాహనం నెంబరు ప్లేట్లు లేకుండా తిరిగితే చట్టరీత్యా నేరమని, మోటారు వాహనాల దారులు చట్టానికి లోబడి నెంబర్లు స్పష్టంగా కనిపించే విధంగా చూసుకోవాలన్నారు. వాహనానికి ముందు వెనుక నెంబరు ప్లేట్లు లేకుంటే వాహనం సీజ్ చేస్తామని సీఐ వాహనదారులను హెచ్చరించారు.

ఎక్సకవేటర్లతో పిచ్చిమొక్కల తొలగింపు


పిచ్చిమొక్కలను ఎక్సకవేటర్లతో తొలగిస్తున్న దృశ్యం

చిన్నమండెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వివిధ వంకలు, కాలువల్లో ఉన్న చెట్లను, పిచ్చిమొక్కలను తొలగించడం ద్వారా వరద ముప్పు తగ్గించవచ్చని మండల ఇంజనీర్ అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేనుసారం జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. అరవీడు పంచాయతీ కుషావతి ప్రాజెక్టు దిగువన ఎల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో కాలువలు, వంకలు, చెట్లు, పిచ్చిమొక్కలతో నిండి ఉండడంతో గురువారం ఎక్సకవేటర్లను తీసుకువచ్చి తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అరవీడు పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్‌నాయుడు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

నందలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని పుట్టగొడుగుల్లా వెలుస్తున్న లేఅవుట్‌లు, ప్లానింగ్ అప్రూవల్ లేని కమర్షియల్ రూములపై ఆరా తీశారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాతమ్మ, వైస్ ఎంపీపీ తుమ్మల భావన, శ్రీధర్‌గౌడ్, అనుదీప్, మండల కోఆప్షన్ సభ్యులు కరీముల్లాఖాన్, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రెండు రోజులు శిక్షణ తరగతులు

నంబేపల్లె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థలో కనీస పరిపాలన విధానాల చట్టం ఏపీపీఆర్ 1994లో 10 అంశాలపై ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్ర గురువారం తెలిపారు. మండల పరిషత్ సభాభవనంలో శుక్ర, శనివారాల్లో శిక్షణ ఇస్తామన్నారు. మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ ఆస్తులు, వీధి దీపాలు, విద్యుత్ బిల్లులు, కోర్టు కేసుల్లో న్యాయపరమైన అక్షరాస్యతపై అవగాహన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తామని తెలియజేశారు.

నేటి తరానికి ఆదర్శం.. వాల్మీకి మహర్షి




సంబేపల్లెలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఈవో, రాయచోటిలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో.. రాజంపేటలో పోతుగుంట రమేష్‌నాయుడు తదితరులు

● డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

సంబేపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నేటి తరానికి ఆదర్శం.. వాల్మీకి మహర్షి అని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులతో కలిసి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన మేలును స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సంస్కృతంలో రాసిన మొదటి కావ్యం కావడంతో రామాయణాన్ని ఆది కావ్యమని అంటారన్నారు. భారతదేశ కుటుంబ వ్యవస్థ ఇంత పటిష్టంగా ఉందంటే అది రామాయణంతోనేనన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పీఎం బాషా, విజయసారథిరెడ్డి, రామయ్య, సురేంద్ర రాజు, రవి, ప్రతాప్, రవిశంకర్, డీఈవో క్యాంప్ క్లర్క్ హబీబ్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: జిల్లా కేంద్రమైన పట్టణంలోని డైట్ స్కూల్‌కు సమీపంలో గల వాల్మీకి విగ్రహం వద్ద జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు గువ్వల యోగానంద బాబు(బుజ్జిబాబు) ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని వాల్మీకి సంఘం సభ్యులతో పాటు వాల్మీకులు, బోయలు పెద్ద సంఖ్యలో హాజరై వాల్మీకి మహాముని విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మండ్ల మన్‌మోహన్, నాగసుబ్బయ్య, రెడ్డి ఆంజనేయులు, మండ్ల రామాంజనేయులు, యాలగిరి చిన్నప్ప, రెడ్డెయ్య, జగన్, జగదీశ్, తదితర వాల్మీకి సోదరులు, పెద్దలు పాల్గొన్నారు.

రాజంపేట: వాల్మీకి మహర్షికి తెలుగు భాష సంరక్షణ సమితి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. గురువారం సాయంత్రం రాజంపేట పట్టణం జౌళీ బజారులో గల సరస్వతి విద్యా మందిరంలో వాల్మీకి మహర్షి జయంతి, శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి కార్యక్రమాలను తెలుగుభాష సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, రాజంపేట మండలశాఖ అధ్యక్షుడు రామచంద్రయ్యనాయుడు, ఉపాధ్యక్షుడు టీవీ నారాయణరాజులు వారి చిత్రపటాలకు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోడూరు గౌరి, తెలుగు ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, దయాకర్ పాల్గొన్నారు.

రాజంపేటటౌన్: మహర్షి ఆదికవి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం రాజంపేట బైపాస్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇన్‌ఛార్జి పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి వీవీ రమణ, బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆదినారాయణ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.సూర్యచంద్ర, బీజేపీ పట్టణ కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, బీజేపీ పార్లమెంట్ నాయకులు నగేష్, బీజేపీ నాయకులు రమేష్, శ్రీనివాసులు, రమణారెడ్డి పాల్గొన్నారు.

పెనగలూరు: రామాయణ వ్యాసకర్త వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఎమ్మార్సీలో ఎంఈవో సిబ్బంది వాల్మీకి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ కె.విజయ్‌కుమార్, సీవో రాజేశ్వరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: పట్టణంలోని శ్రీ భుజంగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఘనంగా వాల్మీకి జయంతిని ఆర్ఎస్ఎస్, విశ్వహిందూపరిషత్, బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు దరిశా వెంకటరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు పులపత్తూరు రామసుబ్బారెడ్డి, బీజేపీ నాయకులు సాయం శ్రీధర్, ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకుడు దశరథరామయ్య, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: రామాయణ సృష్టికర్త, లోకానికి కారణజన్ముడు వాల్మీకి మహర్షి అని మండిపల్లె రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం, బీసీ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఎలంకూరి విజయ భాస్కర్, బీసీ సాధికార సమితి ప్రెసిడెంట్ మండ్లరామాంజనేయులు, బీజేపీ సీనియర్ నాయకుడు క్రిష్ణ, లక్ష్మీవెంకటేశ్వర ఆలయ చైర్మన్ కడియాల వెంకట ప్రసాదు, కావలి ఆంజనేయులు, టీడీపీ ప్రచార కార్యదర్శి యనమల విశ్వనాథ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పసుపులేటికి ఆంధ్ర రత్న పురస్కారం



ఒంటిమిట్ట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ధార్మిక సంస్థల పరిరక్షణ సమితి అధ్యక్షుడు, పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్‌కు వీఐపీ విభాగం కింద ఆంధ్ర రత్న గౌరవ పురస్కారం ఇవ్వనున్నారు. అఖిలభారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆంధ్రప్రదేశ్ కల్చరల్ ఆవేర్నెస్ సొసైటీ అర్పిత సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24వ ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది. వివిధ రంగాల్లో ప్రతిభ పాటవాలు ప్రదర్శించిన వారికి ఆంధ్రరత్న పేరుతో సత్కారాలు ఉంటాయని నిర్వాహకులు తెలియజేశారు.

రూ.17.5 లక్షలతో సిమెంటు రోడ్డు పనులు

పెనగలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగారెడ్డిపల్లె గ్రామ పంచాయతి పరిధిలోని కంబాలకుంటలో గురువారం సాయంత్రం అధికారులు 'పల్లెపండుగ' కార్యక్రమంలో భాగంగా 2 సిమెంటు రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్ సిఫార్సుతో రూ.17.50 లక్షలతో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఇన్‌చార్జి హరిరాయల్, పెనగలూరు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు పి.రవికుమార్, కె.నాగేశ్వరయ్యనాయుడు, రాష్ట్ర కార్యదర్శి ధనంజయ్యనాయుడు, కమ్మసంఘం మండల కార్యదర్శి పి.బాబునాయుడు, జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలక్రిష్ణ, సింగారెడ్డిపల్లె మాజీ సర్పంచ్ ఎం.లక్ష్మీనరసయ్య, వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో విజయరావు, ఏపీవో మురళి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలే లక్ష్యం

గాలివీడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం నూలివీడు, పందికుంట, కొర్లకుంట పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ వెంకటరెడ్డి, ఎంపీడీవో జోహార్‌బాబు, పీఆర్‌జేఈ రాజశేఖర్, సర్పంచులు పార్థసారథిరెడ్డి, మేనక, ఉపసర్పంచ్ పిచ్చయ్య, మాజీ సర్పంచులు ఫరీద్‌బాషా, నరసింహారెడ్డి, వెంకటశివారెడ్డి టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వరద నష్టంపై జిల్లా అధికారులకు నివేదికలు


రెడివారిపల్లెకు వెళ్లే దారిలో దెబ్బతిన్న తాత్కాలిక రోడ్డు

రైల్వేకోడూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో మూడురోజుల పాటు కురిసిన వర్షాల కారణంగా పంటలు, రోడ్లు దెబ్బతిన్నాయి. అధికారులు ప్రాథమిక అంచనాలు వేసి జిల్లా అధికారులకు నివేదికలు పంపారు. గురువారం రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్ మాట్లాడుతూ మండలంలో చియ్యవరం గ్రామంలో నల్లసిద్దు రవీంద్రనాథ్‌రెడ్డికి చెందిన యాలకులు అనే రకం అరటి తోట రెండు ఎకరాల్లో దెబ్బతిందని తెలిపారు. సుమారుగా రూ.7 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. శెట్టిగుంటలో 43 సెంట్లలో వరి పైరు దెబ్బతిని రూ.24 వేలు నష్టం వాటిల్లిందన్నారు. అనంతరాజుపేట పంచాయతీలో తూర్పుపల్లె నుంచి తిమ్మిశెట్టిపల్లెకు వెళ్లే మార్గంలో రోడ్డు దెబ్బతిందని, రెడ్డివారిపల్లెకు వెళ్లే మార్గంలో తాత్కాలికంగా వేసిన రోడ్డు దెబ్బతిందన్నారు. ఈ రెండు పనులకు రూ.9 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. పట్టణంలోని ఆత్మకూరు అరుణ, అనంతరాజుపేట పంచాయతీలోని ఇందిరానగర్‌కు చెందిన మోటా ఆదెమ్మలకు చెందిన పూరిగుడిసెలు దెబ్బతిన్నాయి. ఉర్లగట్టుపోడు తదితర ప్రాంతాల్లో అరటి తోటలు దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. ప్రాథమికంగా అంచనాలు వేసి జిల్లా అధికారులకు పంపారు. ఎకరా అరటి తోటకు ప్రభుత్వం రూ.1 లక్ష నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఇల్లు దెబ్బతిన్న బాధితులకు పక్కా గృహాలు ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

అత్తిరాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం


పనులకు శంకుస్థాపన చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేటటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాజంపేట మండలం అత్తిరాలలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గురువారం టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అత్తిరాల గ్రామంలో రూ.1.52 కోట్లతో చేపట్టనున్న పలు రకాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు అత్తిరాల ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చమర్తి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు ముందుకెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ రామచంద్ర నాయక్, డీఈలు ముజీబ్‌బాషా, శ్రీనివాసరావు, ఏఈలు రమణ, ప్రవల్లిక, కాకతీయ సేవాసమితి అధ్యక్షుడు శివనారాయణచౌదరి, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, రాజంపేట టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వెంకటనరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, కూటమి నేతలు

ఓబులవారిపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కావారిపల్లె గ్రామ పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా సిమెంటు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, టీడీపీ యువ నాయకుడు సాయివికాస్‌రెడ్డిలు మాట్లాడుతూ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సిద్ధం చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా 4500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రాజు, శ్రీధర్‌రాజు, ఉమ్మలరాజు సుబ్బరాజు, వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో మలిరెడ్డి, ఈవోపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, ఏపీవో, పంచాయతీ కార్యదర్శి అనిత, బాలసుబ్రమణ్యం తదితర టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నేతలు పాల్గొన్నారు.

ఇరువురికి తీవ్రగాయాలు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం హరిజనవాడ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారులకు తీవ్రగాయాలయ్యాయి. అనంతపురం వడ్డెపల్లెకు చెందిన రామయ్య తన కుమారుడు మల్లికార్జునతో ద్విచక్రవాహనంలో లక్కిరెడ్డిపల్లెకు వస్తుండగా అనంతపురం హరిజనవాడ సమీపంలో ఎదురుగా కుక్క అడ్డం రావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన పడింది. దీంతో రామయ్య తలకు, శరీరానికి పూర్తిగా గాయాలవగా, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు.

వృద్ధురాలికి తీవ్రగాయాలు

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారి శివాలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. సీఐ హేమసుందర్ వివరాల మేరకు.. అయ్యవారిపల్లె అరుంధతివాడకు చెందిన పూరి లక్ష్మమ్మ శివాలయం వద్ద రోడ్డు దాటుతుండగా కడప నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా గంగమ్మ జాతర

పెనగలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధవరం పంచాయతీ పరిధిలో గల తిరుమలరాజుపేట హరిజనవాడలో గురువారం గ్రామదేవత గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు అధ్యక్షతన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి బలిచ్చే దున్నపోతును ముందుగా గ్రామంలో ఇంటింటికి తిప్పారు. సుమారు 40 ఏళ్ల తర్వాత గ్రామంలో జాతర జరగడం విశేషం.



పొంగళ్లు తీసుకువస్తున్న మహిళలు, (ఇన్‌సెట్లో) తిరుమలరాజుపేట హరిజనవాడలో కొలువై ఉన్న గ్రామదేవత

అన్నమాచార్య అధ్యాపకురాలికి డాక్టరేట్



రాజంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నమాచార్య యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సి.నాగస్వరూపకు జేఎస్ యూనివర్శిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నాగస్వరూప మాట్లాడుతూ తాను 'ఆప్టిమైజింగ్ అల్గోరిథమ్స్‌లు ఇంటిగ్రేట్ అడ్వాన్స్‌డ్ మెషిన్ లెర్నింగ్ మెథడ్స్ ఫర్ ప్రెడిక్టివ్ మెయింటెనెన్స్ ఇన్ ఇండస్ట్రియల్ ఐఓటీ' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ఇచ్చినట్లు తెలిపారు.

సీసీ రోడ్లకు భూమిపూజ

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటపల్లెలో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీ రోడ్లకు ఎంపీడీవో రెడ్డయ్య, తహసీల్దార్ లక్ష్మీప్రసన్నలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత పెంచాలని, ఉపాధి సిబ్బందితో పనులు నిర్వహించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జ్ ఏపీఓ వెంకటపతి, గ్రామ నాయకులు వేమయ్య, వెంకటేశ్వర్లు, రెడ్డిశేఖర్, రెడ్డయ్య పాల్గొన్నారు

వర్షపునీరు లేకుండా చూడాలి : ఏవో


నివారణ చర్యలు తెలియజేస్తున్న వ్యవసాయాధికారిణి

ఓబులవారిపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లాయపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో అరటి రైతులకు మండల వ్యవసాయాధికారిణి మల్లిక సూచనలు ఇచ్చారు. ఉద్యానవన అధికారి భాస్కర్ యల్లాయపల్లె పరిసర ప్రాంతాల్లోని అరటి సాగు రైతులతో సమావేశమయ్యారు. ఏదైనా పంట నష్టం జరిగితే సమీకృత వ్యవసాయాధికారులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తడిసిన పైర్లు తనిఖీ



పెనగలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు చేతికొచ్చే పంటదశలో నేలపై బాగా తడిసిపోయిన వరిపంటను, అలాగే నీరు నిల్వ ఉన్న వేరుశనగ పంటను తనిఖీ చేశారు. నారాయణనెల్లూరు, పెనగలూరు, పొందలూరు, హరిజనవాడ, సిరివరం, సిద్దవరం గ్రామాల్లో 21 హెక్టార్లలో వరిపంట, రెండు హెక్టార్లలో వేరుసెనగ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించినట్లు ఏవో పవన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వంశీ, మల్లేశునాయక్ పాల్గొన్నారు.

డీపీఆర్‌ను త్వరగా రూపొందించండి

నందలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నందలూరు జూనియర్ సివిల్‌కోర్టు నూతన భవనం డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సత్వరం తయారు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏవీ సుబ్రమణ్యం కోరారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డిని గురువారం వినతిపత్రం ద్వారా కోరినట్లు తెలిపారు. తమ కోరికపై ఈఈ సానుకూలంగా స్పందించారని సుబ్రమణ్యం అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది తెట్టు నూర్‌మహ్మద్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సంబేపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుద్యాల గ్రామ పంచాయతీ సచివాలయంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి, పంచాయతీ సెక్రటరి మోహన్‌బాబు తెలిపారు. పట్టణానికి చెందిన అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్యులు ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దుద్యాల గ్రామ ప్రజలు ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

మల్లూరులో పల్లెపండుగ

చిన్నమండెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీలోని ఎగువగడ్డ హరిజనవాడలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం గురువారం అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవపట్ల నజీర్‌బాషా, ఉపసర్పంచ్ ఆదెమ్మ, ఈవోపీఆర్‌డీ శేఖర్‌నాయక్, పంచాయతీ సెక్రటరీ గౌస్‌పీర్, ఇంజనీర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాంమోహన్, సుమలత పాల్గొన్నారు.

పేదింటి బిడ్డలకు.. పెద్ద ఉద్యోగాలు

● ట్రిపుల్‌ఐటీలో చదివి ఐఏఎస్‌లుగా ఎంపిక ● మల్టినేషన్ కంపెనీల్లో లక్షల వేతనంతో సాఫ్ట్‌వేర్ కొలువులు

5వ పేజీ తరువాయి

క్యాంపస్ ఇటర్వ్యూలను ఏర్పాటుచేయించడమే ఈ ప్లేస్‌మెంట్ విభాగం లక్ష్యం. వివిధ కంపెనీలతో మాట్లాడి వారిని ట్రిపుల్‌ఐటీలకు పిలిపించి క్యాంపస్ సెలక్షన్లను ఏర్పాటుచేయించడంతో ప్రతిభ ఉన్న విద్యార్థులు పరీక్షల్లో పాల్గొని ఉద్యోగాలు పొందేవారు. వీలైనన్ని ఎక్కువ కంపెనీలను ట్రిపుల్‌ఐటీలకు రప్పించడం లక్ష్యంగా ఈ ప్లేస్‌మెంట్ విభాగం పనిచేస్తోంది.


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్ భవన సముదాయం


ల్యాప్‌టాప్‌ల ద్వారా విద్యనభ్యసిస్తున్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

ఇంజనీర్లుగా, గెజిటెడ్ ఆఫీసర్లుగా, ఐఏఎస్‌లుగా

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఆరుసంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ చదివిన 11 బ్యాచ్‌లు బయటకు వెళ్లాయి. సుమారు 15,000 మంది విద్యార్థులు చదువుకున్నారు. వీరిలో చాలా మంది ఇంజనీర్లుగా ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో పనిచేస్తున్నారు. మల్టీనేషనల్ కంపెనీలైన అమెజాన్, టీసీఎస్, ఐబి, న్యాక్ టెక్నాలజీస్, హుండై, క్యూబ్, జోరియంట్, ఇంటెల్, మ్యాపిల్ తదితర ఎన్నో కంపెనీలు చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా సెలెక్ట్ అయి ఉద్యోగాలు చేస్తున్నారు. కొందరు గెజిటెడ్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారు. కడప జిల్లా మైదుకూరు మండలం చిన్నయ్యగారిపల్లెకు చెందిన చీమల శివగోపాల్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా నందలూరుకు చెందిన విద్యాధరి ఐఏఎస్‌కు ఎంపికై డిప్యూటీ కమిషనర్, జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.

బయటకెళ్లాక మరింత మంచి వేతనాలు

ట్రిపుల్‌ఐటీల్లో చదువుకుంటూ క్యాంపస్ సెలక్షన్స్‌లో మల్టీనేషనల్ కపెనీలకు ఎంపికైన విద్యార్థులు లక్షల్లోనే వార్షిక వేతనం తీసుకుంటున్నారు. ఉద్యోగం చేస్తూనే కొత్తకొత్త కంపెనీల్లో ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించి మరింత మంచి వేతనం పొందే ఉద్యోగాలు పొందిన వారు చాలా మందే ఉన్నారని, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అకడమిక్ డీన్‌గా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్నకుమారి తెలిపారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఉద్యోగాలు పొందడంతో పాటు ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యనభ్యసించేందుకు వెళ్లినవారు ఉన్నారని అన్నారు.

వరంగా మారిన ట్రిపుల్‌ఐటీ విద్య

ట్రిపుల్‌ఐటీలు ముఖ్యంగా పేద, నిరుపేద కుటుంబాలకు వరంలాంటివని చెప్పవచ్చు. ట్రిపుల్‌ఐటీల్లో ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకే ప్రాధాన్యత ఇవ్వడంతో చాలా మంది కూలీలు, డ్రైవర్లు, రైతులు, ఇతర వర్గాల కుటుంబాల్లోని పిల్లలు ఇక్కడ చదువుకున్నారు. చాలా మంది విద్యార్థులు చక్కగా చదివి ఇంజనీర్లు అయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేయడం, మల్టీనేషనల్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ కొలువుల్లో చేరి లక్షలాది రూపాయలు వేతనాలు పొందడం ద్వారా ఆ కుటటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగైంది.

బయట కంపెనీలకు అనుగుణంగా శిక్షణ

ప్రస్తుతం మార్కెట్‌లో కంపెనీలకు ఏయే అవసరాలు ఉన్నాయి అనే దానిపై అధ్యయనం చేసి విద్యార్థులకు వాటిపైనే శిక్షణ ఇస్తున్నాం. ప్లేస్‌మెంట్ సెల్‌ను మరింత బలోపేతం చేశాం. 24గంటలు నడిచే ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశాం. కోడింగ్, డీకోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై ఫైనలియర్‌తో పాటు మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గురించి పీయూసీ నుంచే శిక్షణ ఇస్తున్నాం. ట్రిపుల్‌లో ఐటీ చేరిన విద్యార్థులు బాధ్యతగా కష్టపడి క్రమశిక్షణతో చదువుకుంటే క్యాంపస్ సెలక్షన్ల ద్వారా, ఇతర మార్గాల ద్వారా ఉద్యోగాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- ప్రొఫెసర్ కుమారస్వామి గుప్త, డైరెక్టర్ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ

ఎక్కువమందికి ఉద్యోగ కల్పనే లక్ష్యం

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చేరిన అందరు విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రత్యేక స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాంను వినూత్నంగా పీయూసీ నుంచే మొదలుపెడుతున్నాం. మద్రాస్ ఐఐటీతో ఒప్పందం చేసుకున్నాం. టాటా కోడింగ్, అనలాజికల్ ఇంటలిజెన్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఫైనలియర్ విద్యార్థులతో పాటు కొత్తగా మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సెకెండ్ సెమిస్టర్ నుంచే ఇంటర్వ్యూలో ఎలా పాల్గొనాలి, పరీక్షలు ఎలా రాయాలి అనే వాటిపై శిక్షణ ఇస్తున్నాం. తద్వారా వీలైనంత ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఆర్జీయూకేటీ లక్ష్యంగా పనిచేస్తున్నాం.

- ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సంద్ర, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చేర్పించేందుకు పిల్లలను పిలుచుకొచ్చిన తల్లిదండ్రులు

వందలాది మందికి ఉద్యోగాలు

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చదివిన పేద, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల వారికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. క్యాంపస్ సెలక్షన్ల ద్వారా ఉద్యోగాలు రాగా చదువు పూర్తయి బయటకు వెళ్లాక పలువురు విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. ఇప్పటి వరకు ఇడులపాయ ట్రిపుల్‌ఐటీలో వివిధ కంపెనీల్లో క్యాంపస్ సెలక్షన్ల ద్వారా ఎంపికైన విద్యార్థుల వివరాలు, వారు పొందిన వార్షిక వేతనాలు వివరాలు..

బ్యాచ్	ఉద్యోగాలకు ఎంపికైనవారు	వార్షికవేతనం రూ.లక్షల్లో
2008	365	16
2009	292	13
2010	288	13.20
2011	244	8.20
2012	264	7.20
2013	290	14.93
2014	299	14
2015	306	24
2016	560	17.30
2017	396	12
2018	425	14


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చేరేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎంపికైన విద్యార్థులు


మల్టీనేషనల్ కంపెనీకి ఎంపికైన ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులతో ట్రిపుల్‌ఐటీ అధికారులు

ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాధాకృష్ణ



రాయచోటిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి.రాధాకృష్ణను ఎన్నుకున్నారు. బుధవారం అమరావతిలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగానే రాయచోటి పట్టణంలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రభుత్వంతో చర్చించి ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ, ఐఆర్‌జీవో 117, సీపీఎస్ రద్దు, బదిలీలు, పదోన్నతుల సాధనకు కృషి చేస్తామని తెలిపారు.

కొండ మీద పిడుగు


పిడుగుపడడంతో అక్కుమలకొండ మీద చెలరేగిన మంటలు

చిన్నమండెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలంలోని బోరెడ్డిగారిపల్లెకు సమీపాన ఉన్న అక్కుమలకొండమీద గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో కురిసిన వర్షానికి పిడుగుపడడంతో కొండమీద మంటలు చెలరేగాయి. అయితే బోరెడ్డిగారిపల్లెకు కాస్త దూరం ఉండడంతో ఎలాంటి నష్టం జరగలేదు. అదే కాస్త ఇటు అయ్యింటే పల్లెలోనే పడిందేదని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ పరిసర ప్రాంతాల్లో ఎవరు జనాలు లేకపోవడంతో ఎలాంటి నష్టం జరగలేదు.

శభాష్.. తేజశ్విని.. చంద్రబాబు ప్రశంస


సీఎం చంద్రబాబుతో సీఎం ర్యాంకర్ తేజశ్విని

తంబళ్లపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబంలో పుట్టి కృషి, పట్టుదలతో చదివి సీఏ, సీఎంఏలో ఆలిండియా ర్యాంకు సాధించిన రైతు బిడ్డ తేజశ్వినిని సీఎం చంద్రబాబునాయుడు ప్రశంసించారు. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన కె.రఘురాంరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె తేజశ్విని తల్లితండ్రుల కష్టాన్ని చూస్తూ చిన్నతనం నుంచే చదువులో ప్రతిభ కనపరిచేది. ప్రాథమిక విద్య తంబళ్లపల్లెలో పూర్తి చేసి జవహర్ నవోదయలో సీటు సాధించింది. సీఏ చేయాలనే లక్ష్యంతో గుంటూరు మాస్టర్ మైండ్స్‌లో చేరి కృషి, పట్టుదలతో చదివి ఈ ఏడాది జూలై 11న విడుదలైన సీఏ ఫైనల్ ఫలితాల్లో 455 మార్కులతో ఆలిండియా 14వ ర్యాంకు సాధించింది. అంతేకాకుండా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆగస్టు 23న విడుదల చేసిన సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ) ఫలితాల్లో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, మాస్టర్ మైండ్స్ యాజమాన్యం ఆహ్వానం మేరకు బుధవారం సాయంత్రం తేజశ్విని తండ్రి రఘురాంరెడ్డి, చిన్నాన్న అమర్‌నాథరెడ్డితో కలసి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సీఎం తేజశ్వినిని అభినందించారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో

నందలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కొండయ్య మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అధిక వర్షపాతం కారణంగా రవాణాకు దూరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.


గర్భిణులను గుర్తించి వారిని కాన్పుల కోసం దగ్గరలోని వారికి ఇష్టమైన ఆసుపత్రుల్లో చేర్పించాలని సూచించారు. అలాగే షుగర్, బీపీ, తీవ్రమైన జబ్బులతో బాధపడుతున్న వారిని గుర్తించి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించాలన్నారు. వర్షం తగ్గిన తర్వాత లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండి మలేరియా, డెంగ్యూ జ్వరాలు, విరేచనాలు ప్రబలేందుకు అవకాశం ఉందని కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆశాలకు, మహిళ ఆరోగ్య కార్యకర్తలకు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, విశ్వనాథ్, సీహెచ్‌వో వెంకటనారాయణ, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ తడుస్తోంది...

● కలెక్టర్ ఛాంబర్‌లో లీకేజీ ● ప్రతి రూములోనూ ఇదే పరిస్థితి
● మరమ్మతులు చేయడానికి నిధులు లేవంటున్న ఆర్‌అండ్‌బీ


కలెక్టర్ ఛాంబర్ ముందు వర్షపు నీటిని తుడుస్తున్న దృశ్యం

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటు చేసిన కలెక్టరేట్ భవనాలు కొద్దిపాటి వర్షానికి తడిసి ముద్ద అవుతున్నాయి. అప్పటి ప్రభుత్వం జిల్లాలు ఏర్పాటు చేస్తూ బాలుర గిరిజన గురుకుల పాఠశాలను కలెక్టరేట్ కార్యాలయంగా ఏర్పాటు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అయితే అందుకోసం దాదాపు రెండు కోట్ల రూపాయలు వెచ్చించి భవనాలను అనుకూలంగా మార్చి కలెక్టరేట్‌గా ఏర్పాటు చేసుకున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కలెక్టరేట్‌లోని అన్ని భవనాలు తడిసి ముద్దవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో కూడా నీళ్లు కారడం, అలాగే ముఖ్యమైన సెక్షన్లలో కూడా వర్షపు నీరు రావడం ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ఇబ్బందికరంగా ఉందని తెలిసింది. గతంలో ఉన్న కలెక్టర్ కూడా ఇలాగే వర్షం పడినపుడు కారుతూ ఉంటే బిల్డింగుపైన ప్లాస్టింగ్ చేయించారని, అయినప్పటికీ కూడా మళ్లీ వర్షాలు వస్తే అక్కడక్కడా కారుతోందని సిబ్బంది చెబుతున్నారు. మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాల్‌కు పీయూపీ చేయడం వల్ల నీరు కారణం కనిపించలేదు. పీయూపీ లేని పక్షంలో ఆ బిల్డింగులు కూడా వర్షపు నీరు వచ్చే ప్రమాదం ఉందని కొంతమంది ఉద్యోగులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా కొత్త జిల్లాలపై శ్రద్ధ పెట్టి భవనాలకు మరమ్మతులు చేస్తే బాగుంటుందని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ విషయంపై కలెక్టరేట్ ఏవో నాగభూషణంను వివరణ కోరగా వర్షం ఆగిన తర్వాత కలెక్టరేట్ భవనంలో ఎక్కడెక్కడ లీకేజీలు ఉన్నాయో వాటికి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.


స్లాబ్ నుంచి కారుతున్న వర్షం నీళ్లు

పింఛా ప్రాజెక్టును పరిశీలించిన అధికారులు


పింఛా ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

సుండుపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పింఛా సమీపంలో ఉన్న యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి ప్రాజెక్టును ఇరిగేషన్ ఈఈ వెంకట్రామయ్య గురువారం పరిశీలించారు. పింఛా ప్రాజెక్టులోకి పై ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీరు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షం అధికంగా పడితే పై ప్రాంతాల్లో పాటు అటవీ ప్రాంతం నుంచి ఎక్కువ నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయని అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి నీటి సామర్థ్యాన్ని చెక్ చేయాలన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 164 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రాజెక్టు దిగువ భాగంలో నది పరీవాహక ప్రాంతాల్లోకి ప్రజలను ఎవరిని వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ చెంగల్‌రాయుడు, ఏఈ నాగేంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నందలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందలూరు, నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ ఉద్యాన పంటలను రాజంపేట ఉద్యాన అధికారి సురేష్‌బాబు, మండల వ్యవసాయాధికారి జి.మల్లికార్జున గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయాధికారి మల్లికార్జున మాట్లాడుతూ అధిక వర్షాలకు వరి పొలాల్లో నిలబడిన నీటిని ప్రత్యేక కాలువల ద్వారా వెంటనే బయటికి పంపాలని తెలిపారు. నేలకొరిగిన వరి పైరును కట్టలుగా కట్టి నిలబెట్టుకోవాలి. అలాగే కోత కోసి నిల్వ ఉంచిన వరికుప్పలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు మాట్లాడుతూ ఉద్యాన పంటలైన అరటి, నిమ్మ, పసుపు, బొప్పాయ పంటల్లో తేమ ఆరిన తరువాత 13.0.45 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో షణ్ముఖ్, వీహెచ్‌ఏ వరున్, రైతులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి వాసి బెంగళూరులో దారుణ హత్య

● వివాహేతర సంబంధమే కారణం


బాలాజి (ఫైల్)

నిమ్మనపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కారణంగా నిమ్మనపల్లి వాసి బెంగళూరులో స్నేహితుడి చేతిలో దారుణ హత్యకు గురైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ గుండ్లబురుజు దళితవాడకు చెందిన బాలాజీ (24) ఉపాధి నిమిత్తం మూడేళ్లుగా బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తుండేవాడు. అయితే రామసముద్రం మండలానికి చెందిన రెడ్డెప్పరెడ్డితో స్నేహం ఏర్పడింది. కాగా రెడ్డెప్పరెడ్డి తన భార్య పిల్లలతో బెంగళూరులోని దొడ్డనహళ్లిలో కాపురం ఉంటున్నాడు. బాలాజీ అప్పడప్పుడు రెడ్డెప్పరెడ్డి ఇంటికి వెళుతూ అతడి భార్యతో పరిచయం పెంచుకున్నారు. వారి పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం రెడ్డెప్పరెడ్డికి తెలియడంతో ఎలాగైనా బాలాజీని చంపాలని పథకం వేశాడు. ఈ క్రమంలో తన భార్య పిల్లలను రామసముద్రంకు పంపించి బాలాజీని ఆదివారం తన ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం ఇద్దరూ మద్యం తాగి ఆ మత్తులో బాలాజీని దారుణంగా హత్య చేశాడు. వెంటనే ఇంటి తలుపులు వేసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. నిమ్మనపల్లి నుంచి బాలాజీ తండ్రి రమణ, తల్లి నాగమ్మలు ఫోన్ చేసినా తీయకపోవడంతో అనుమానం వచ్చి బెంగళూరులోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా బాలాజి చనిపోయి ఉండటాన్ని గమనించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

దీంతో గురువారం బాలాజీ మృతదేహాన్ని గుండ్లబురుజుకు తరలించారు. అయితే ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు భోరున విలపించారు. దీనిపై బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తెగుళ్లు..ఆపై వర్షం దెబ్బ..

● టమోటా, వంకాయ నేలపాలు


వాల్మీకిపురం వద్ద వర్షానికి దెబ్బతిన్న టమోటా పంట

వాల్మీకిపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా కురుస్తున్న వర్షం రైతులను తీవ్ర నష్టాలకు గురి చేస్తోంది. వాల్మీకిపురం సమీపంలో రైతు శేఖర్ సుమారు పదిఎకరాలకుపైగా టమోటా, వంకాయ, బొప్పాయి, మునగ తోటలను పదిలక్షలు వెచ్చించి సాగు చేశాడు. టమోటా వర్షంతో దెబ్బతిని రాలిపోతుండటం, వంకాయకు కుళ్లు తెగుళ్లు, మునగకు బంక తెగుళ్లతో పూత మొత్తం రాలిపోవడం, ఉన్న అరాకొర రాయలు కూడా నలుపు రంగులోకి తిరిగి తీవ్ర నష్టం వాటిల్లింది. బొప్పాయి పంట వ్యాపారులు రాకపోవడంతో కాయలను తోటల్లోనే వదిలేశారు. ఆరుగాలం శ్రమించి పంటలు సాగుచేస్తే ఇలా తెగుళ్లు, వర్షం దెబ్బకు నష్టపోతున్నామని, కనీసం కూలీలు కూడా గిట్టుబాటు కాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని శాఖంవారిపల్లెకు చెందిన వెంకటరమణనాయుడు రూ.14లక్షలు ఖర్చు చేసి నాలుగు ఎకరాలలో టమోటా పంట సాగుచేస్తే కోతకొచ్చిన సమయాన వర్షం దెబ్బకు టమోటాలు పగుళ్లు వచ్చి రాలిపోతుండటంతో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక భోగంపల్లె సమీపంలో రైతు రమణారెడ్డికి చెందిన వరిపైరు వర్షం దాటికి దెబ్బతిని నష్టం వాటిల్లింది. తుపాను వర్షం కారణంగా మండలం వ్యాప్తంగా పంటలకు నష్టం వాటిల్లింది.

కూలీలు కూడా రావడం లేదు..



లక్షలు ఖర్చు చేసి పంటలు సాగుచేస్తే పంట చేతికొచ్చే సమయాన తెగుళ్లతో మందుల భారం ఎక్కువవుతోంది. పదిఎకరాలకు పైగా టమోటా, వంకాయ, బొప్పాయి, మునగ పంటలు సాగుచేశాను. రెండు రోజులుగా పంటలన్నీ నష్టమే. ఉన్న అరాకొర పంట కోసి మార్కెట్‌కు తీసుకెళ్తే కనీసం కూలీలు కూడా గిట్టుబాటు కావడం లేదు. నష్టాలలో కూరుకుపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

-శేఖర్, రైతు, వాల్మీకిపురం.


దెబ్బతిన్న టమోటా పంట చూపుతున్న రైతు వెంకటరమణనాయుడు

బురకాయలకోట సీతాఫలం... రుచి మధురం



ఈ ప్రాంతంలోని అడవులు, కొండలు, గుట్టల్లో సీతాఫలం చెట్లు పెద్దఎత్తున ఉన్నాయి. ఇక్కడ సహజ సిద్ధంగా స్వచ్ఛమైన వాతావరణంలో పండే ఈ సీతాఫలాలు ఎంతో మధురంగా ఉంటాయి. వీటికి ఎలాంటి రసాయనాలు, పురుగుల మందులు వాడరు. దీంతో బురకాయలకోట సీతాఫలంకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి సీతాఫలం కాయలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. దీంతో కూలీలకు ఉపాధితో పాటు వ్యాపారులు మంచి ఆదాయం పొందుతున్నారు.

- సహజ సిద్ధంగా కాపు.. మంచి డిమాండ్
- ఇతర రాష్ట్రాలకు తరలింపు
- కూలీలకు ఉపాధి.. వ్యాపారులకు ఆదాయం

ములకలచెరువు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు మండలం బురకాయలకోట, దేవళచెరువు, సోంపాళ్యం, కాలువపల్లె, నల్గొండ, బి.కొత్తకోట మండ లం హార్సిలీహిల్స్, గట్టు, తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె, ముద్దలదొడ్డి, పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు, బి.కొత్తకోట మండలం బయప్పగారిపల్లె, ఉలవలవారిపల్లె, కురబలకోట మండలాల గ్రామాల సమీపాల్లో అడవులు, కొండలు, గుట్టలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ సీతాఫలం చెట్లు వేలల్లో ఉన్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో సీతాఫలం కాయలు కాస్తాయి. ఈ ప్రాంతాల నుంచి కూలీలు కాయలను కోసుకొచ్చి బురకాయలకోటలో విక్రయానికి తీసుకొస్తారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు, నల్లచెరువు, సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం బాగేపల్లె, చేలూరు తదితర ప్రాం తాల నుంచి కూడా కాయలను కోసుకొచ్చి విక్రయించడానికి కూలీలు ఇక్కడికి తెస్తున్నారు. ఆగస్టు నుంచి నవంబరు ఆఖరు వరకు సీజన్ నడుస్తుంది. ఇక్కడ కూలీల దగ్గర నుంచి సీతాఫలం కాయలను వ్యాపారులు కొనుగోలు చేసి వాటిని గ్రేడింగ్ చేసి రాష్ట్రంలోని గుంటూరు, విజయవాడ, కర్నూల్, రాజమండ్రి, అనంతపురం నంద్యాల, విశాఖపట్నం తదితర పట్టణాలకు తరలి స్తారు. అలాగే తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు, మిర్యాలగూడ,మహబూబ్‌నగర్, సిరిసిల్ల, కరీంనగర్, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, రాయచూర్, గుల్బర్గా, సిందనూరు, హాస్పేట్, హుబ్లీ, బళ్లారి, మహారాష్ట్ర రాష్ట్రం సోలాపూర్, తమిళనాడు రాష్ట్రం చెన్నై, కోయంబత్తూరు ప్రాంతాలకు ఎగుమతి చేసి విక్రయిస్తుంటారు.

కూలీలకు జీవనోపాధి

ప్రతి ఏడాది సీతాఫలం కాయలతో ఈ ప్రాంతాల్లోని కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఆగస్టు నుంచి నవంబరు నెల వరకు సీతాఫలం కాయలు కోసుకొచ్చి ఇక్కడి తెచ్చి విక్రయిస్తారు. కూలీలు ప్రతి రోజు ఉదయమే అడవులు, కొండలు, గుట్టలకు వెళ్లి కాయలు సేకరించి సాయంత్రం బురకాయలకోటకు తీసుకొచ్చి వ్యాపారస్థులకు విక్రయిస్తారు. వ్యాపారులు కూలీల వద్ద నాణ్యతను బట్టి ఒక్కో క్రేట్‌ను రూ.400 నుంచి రూ.600 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో కూలీ ప్రతి రోజు రెండు నుంచి మూడు క్రేట్ల కాయలు సేకరించి అమ్మకానికి తీసుకొచ్చి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు సంపాదిస్తున్నారు. గతంలో ఇక్కడి నుంచి ప్రతి రోజూ 2వేల క్రేట్ల వరకు ఎగుమతి అయ్యేవి. కాగా కాయలు సైజులు వచ్చే సమయంలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో నెలకొన్న వర్షాభావం కారణంగా కాయలు సైజులు లేకపోవడంతో ప్రతి రోజూ 600 క్రేట్ల వరకు కాయలు ఎగుమతి అవుతున్నాయి.



బురకాయలకోట నుంచి ఎగుమతి చేసేందుకు క్రేట్లలో సిద్ధం చేసిన సీతాఫలం కాయలు



జీవనోపాధి దొరుకుతోంది

సీతాఫలం కాయల ద్వారా ప్రతి ఏటా జీవనోపాధి లభిస్తోంది. మా ఊరికి సమీపంలో ఉన్న కొండలు, గుట్టల్లోకి వెళ్లి ప్రతిరోజూ రెండు క్రేట్ల కాయలను కోసుకొచ్చి ఆటో బాడుగకు మాట్లాడుకుని బురకాయలకోటకు తీసుకొచ్చి అమ్ముకుంటున్నాం. వర్షాలు బాగా కురిసి కాయలు బాగా కాస్తే మంచి ఉపాధి దొరుకుతుంది.

\- రామలక్ష్మమ్మ, కూలీ, బురకాయలకోట

ఇష్టంగా తింటారు

సహజ సిద్ధంగా కాచే ఇక్కడి సీతాఫలం కాయలను ఇష్టంగా తింటారు. ప్రతిరోజూ రెండు బాక్సుల కాయలు కోసుకొచ్చి రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నాను. అయితే ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షం కురవక సీతాఫలం కాయలు సైజు రాలేదు. దీంతో కాయల దిగుబడి తగ్గింది.



\- మునెమ్మ, కూలీ, బురకాయలకోట

వరద ప్రభావిత ప్రాంతాలలో సబ్ కలెక్టర్ పర్యవేక్షణ



పునరావాస కేంద్రంలో వరద బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

రైల్వేకోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల నుంచి రైల్వేకోడూరులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముందు జాగ్రత్త చర్యగా రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవి బుధవారం అర్ధరాత్రి వరకు రైల్వేకోడూరులోనే తిష్ట వేసి వరద ప్రభావిత ప్రాంతాలలో పరిస్థితులను పర్యవేక్షించారు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందితో కలసి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కాగా, సబ్ కలెక్టర్ ఆదేశాల ప్రకారం రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తమ సిబ్బందితో ఐదు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి బుధవారం సాయంత్రం వరద బాధితులను తరలించి.. రాత్రి భోజనాలు తగిన వసతులను ఏర్పాటు చేయించారు. గురువారం ఉదయం, మధ్యాహ్నం మళ్లీ వర్షాలు కురుస్తాయనే ఉద్దేశ్యంతో ముందుస్తుగా పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు అల్పాహారాలు, భోజనాలు ఏర్పాటు చేయించారు.

గండికోటకు 3వేల క్యూసెక్కుల వరదనీరు

కొండాపురం/ మైలవరం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండురోజులగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల ద్వారా గండికోట పాజెక్టులోకి గురువారం 3వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా అవుకు రిజర్వాయిర్ నుంచి మరో 4300 క్యూసెక్కుల కృష్ణాజలాలు ప్రాజెక్టులోకి వస్తున్నాయన్నారు. ఇప్పటికే ప్రాజెక్టులో తగినంత నీటిమట్టం ఉండటంతో గేట్లు ఎత్తి మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. కాగా, మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి నీటి విడుదల కొనసాగుతుంది. గురువారం గండికోట జలాశయం నుంచి 7,500 క్యూసెక్కుల నీరు వచ్చి మైలవరంలో చేరుతుండటంతో పెన్నానదికి 8 వేల క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 25 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జలాశయ నరసింహమూర్తి తెలిపారు. మైలవరానికి గండికోట నుంచి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి వదిలే అవకాశం ఉందని పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న మిషన్ వాత్సల్య శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టరు

కడప నాగరాజుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శిక్షణ కార్యక్రమాలతో క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించవచ్చుని మిషన్ వాత్సల్య శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టరు ఎ.విజయ పేర్కొన్నారు. గురువారం కడప డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో కర్నూలు రీజియన్‌లోని కడప, కర్నూలు, చిత్తూరు, నంద్యాల, అన్నమయ్య, తిరుపతి, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలలో కొత్తగా నియామకం అయిన మిషన్ వాత్సల్య సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలకు హాజరై శిక్షణ పొందడం వల్ల మనకు తెలియని చాలా విషయాలు తెలుసుకోవచ్చొన్నారు. వివిధ జిల్లాల అనుభవాలను చర్చించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలో తెలుసుకోవచ్చన్నారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రోహి బి, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి, ప్రోగ్రాం మేనేజరు కమల్‌కుమార్, వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్



అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో గురువారం పోస్టుగ్రాడ్యుయేషన్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం అయ్యాయి. ప్రవేశాలకు విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. 25 కోర్సులకు ఏపీ పీజీ సెట్ 2024 అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను డాక్టర్ రామక్రిష్ణ, డాక్టర్ గణేశ్‌నాయక్ పరిశీలించారు. ఈ ప్రవేశాలు ఈనెల 1వ తేదీ వరకు కొనసాగుతాయని ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ తెలిపారు.

డ్రాగా ముగిసిన అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు



వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్



80 పరుగులు సాధించిన రామ్‌చరణ్, 65 పరుగులు చేసిన కార్తీక్

కడప(స్పోర్ట్స్), అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 మెన్స్ మల్టీడే రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా గురువారం వివిధ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌లు వర్షం కారణంగా డ్రాగా ముగిశాయి. ఓ మ్యాచ్ పూర్తిగా ఆట సాగలేదు. వివరాలిలా....

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-విశాఖ జట్ల మధ్య సాగిన రెండవ రోజు ఆటలో వర్షం కారణంగా మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించారు. దీంతో టాస్ నెగ్గిన కడప జట్టు ఫీల్డింగ్ చేయగా బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 39 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేసింది. ఇందులో రామ్‌చరణ్ 80 పరుగులు, వినోద్, 52, థమన్‌రెడ్డి 51 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 98 పరుగులు మాత్రమే చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అలాగే కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో గురువారం ఈస్ట్‌గోదావరి- వెస్ట్ గోదావరి జట్ల మధ్య సాగిన మ్యాచ్ వర్షం కారణంగా 25 ఓవర్లకు కుదించారు. టాస్ నెగ్గిన ఈస్ట్ గోదావరి జట్టు తొలుత బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 127 పరుగులు సాధించింది. ఇందులో కార్తీక్ 65 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు 25 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. ఇక కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రకాశం-కర్నూలు జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. 16, 17 తేదీలలో (బుధ, గురువారం) వర్షం కారణంగా ఆట సాగలేదు.

అందరికి అందుబాటులో ఇసుక : ఇన్‌చార్జి కలెక్టర్



ఇసుక లోడింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, కొబ్బరికాయ కొట్టి ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

పెండ్లిమర్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త గంగిరెడ్డిపల్లె గ్రామంలో ఇసుక క్వారీని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడ ఎలాంటి లోపాలు జరగకుండా సంబంధిత అధికారులు ప్రజలకు ఇసుకను అందేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా అందరికి అందుబాటులోకి ఇసుకను తీసుకొచ్చామన్నారు. మండలంలోని కొత్త గంగిరెడ్డిపల్లె, మాచునూరు, కొండూరు, నందిమండలం గ్రామాల పరిధిలోని పాపాఘ్ని నదిలో ఇసుక రీచ్‌లను ఏర్పాటుచేశామన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, కూటమి ప్రభుత్వంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుడా ప్రజలందరికి అందుబాటులో ఇసుక పాలసీని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర అధికారులు, టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : 1, 2తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను రెసిడెన్షియల్ పద్దతిలో నిర్వహించడాన్ని రద్దు చేయాలని ఎస్టీఎఫ్ జిల్లాగౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం కడప ఎస్టీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు అక్టోబరు 21 నుంచి 26 వరకు ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో రాష్ట్రంలో 9 కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం వల్ల ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థులు బోధనకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఈ శిక్షణను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు రాజగోపాలరెడ్డి, క్రిష్ణఫర్జాన్, ప్రసాద్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రవిశంకర్ పాల్గొన్నారు.

మేకల కాపరి అదృశ్యం

అట్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలువాండ్లపల్లె గ్రామానికి చెందిన సొంట గంగిరెడ్డి నాలుగు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. అడవిలో మేకలను మేపుకోవడానికి వెళ్లి కనిపించకుండా పోయాడు. గురువారం కలవాండ్లపల్లె వరికుంట ఎస్సీ కాలనీ, బీసీ కాలనీవాసులు సుమారు 80 మంది బృందాలుగా ఏర్పడి అడవిలో వెతికినా గంగిరెడ్డి ఆచూకీ తెలియలేదు. దీంతో బద్వేలు నుంచి డ్రోన్ కెమెరాలు తెప్పించి ప్రయోగించిన గంగిరెడ్డి ఆచూకీ లభించలేదు. ఈ మేరకు భార్య ఓబులమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె రామిరెడ్డిలేవుట్‌లో నివశిస్తున్న రియాజ్ బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. ఇతను ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. 2011లో తాసీజ్‌భానుతో వివాహం అయింది. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ విషయమై భార్య భర్తలు గొడవపడ్డారు. సోమవారం భర్తపై అలిగి పుట్టింటికి తమ పిల్లలను తీసుకుని భార్య వెళ్లిపోయింది. ఆమె తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన రియాజ్ ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. అలకతీరిన భార్య తిరిగి గురువారం ఇంటికి వచ్చి చూడగా.. భర్త మృతి చెందిన విషయం వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మదనపల్లె అర్బన్, అక్టోబరు 17: మదనపల్లె పట్టణం, ఈస్ట్ కొత్తపేటలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. గురువారం ఏభైఐదేళ్ల కలిగిన గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉండటం గుర్తుంచిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అనంతరం పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. చనిపోయి వ్యక్తి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు మున్సిపల్ టీచర్లుకు కూడా కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్ బాబు తెలిపారు. గురువారం కడప డీఈవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో ఇప్పటికీ తగినంత సబ్జెక్టు టీచర్లు లేరని, 3, 4, 5 తరగతులను విలీనం చేశారు తప్ప ఆ తరగతులు బోధించడానికి స్కూలు అసిస్టెంట్లను ఇవ్వలేదన్నారు. పదోన్నతులు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదన్నారు. ఎప్పుడు నిర్వహిస్తారో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం పంచాయతీరాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఈవో పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఈవో అనురాధకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శులు సీవీ రమణ, ఎజాజ్ హ్యాద్, నాయకులు ప్రభాకర్, రూత్ ఆరోగ్యమేరీ, క్రిష్టారెడ్డి, మేరీ ప్రసన్న పాల్గొన్నారు.

పబ్లిక్ అండ్ హెల్త్ ఈఈగా జె.రమణమూర్తి



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప కార్పోరేషన్ పబ్లిక్ అండ్‌హెల్త్ ఈఈగా జె.రమణమూర్తి గురువా రం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాశ్వత నీటి పరిష్కారానికి బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు నుంచి కడప బండి కనుమ వరకు 55 కి.మీ మేర పైపులైను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కడప కార్పోరేషన్ నిధులు రూ.540 కోట్లతో ఈప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కురబలకోట, అక్టోబరు 17: డిగ్రీ చదుతున్న విద్యార్థిని ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. కనసాని వారిపల్లె పంచాయతీ సిద్దా రెడ్డిగారి పల్లెకు చెందిన శివశంకర్, భాగ్యమ్మ దంపతుల కుమార్తె శిరీష (21) ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో పంటకు పిచికారి చేయడానికి తెచ్చిన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి రెఫర్ చేశారు. కాగా, ఈసంఘటనకు గల కార ణాలు తెలియాల్సి ఉంది. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బి.కొత్తకోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లె అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడు నాగ రాజు(52) వాల్మీకిపురం టౌన్ నమాజుకట్ట వీధికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కూలీపనుల నిమిత్తం బి.కొత్తకోట ప్రాంతానికి వచ్చిన నాగ రాజు స్థానికంగా నివాసం వుంటూ ఒంటరిగా జీవనం సాగిం చేవాడు. ఈనేపథ్యంలో గుడిపల్లి వద్ద చెట్టుకు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఇతని మృతికి దారితీసిన కారణాలు తెలియాల్సి వుందని బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి పేర్కొన్నారు.

ఉపాధితో కలిసొచ్చేనా..?

- ప్రయాణం....సాహసమే...!
- దుస్థితికి చేరిన రోడ్లు..వర్షంతో రాకపోకలకు ఇబ్బందులు
- గత వైసీపీ హయాంలో గంపెడు మట్టి వేయని వైనం
- అధ్వాన్నస్థితిలో పెద్దమండ్యంలోని శివపురం-తంబళ్లపల్లె రోడ్డు

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లెపండుగలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేప ట్టింది. ఈ పథకాన్ని అన్ని మండలాల్లో అమలు చేస్తే చాలా చోట్ల అధ్వాన్నస్థితిలో ఉన్న రోడ్లు బాగుపడుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆశిస్తున్నారు. ఆమేరకు పల్లెవాసుల ఆశలు నెరవేరుతాయని ఆశిద్దాం.

ములకలచెరువు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలంలోని పలు రోడ్లపై ప్రయాణం చేయాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. తుఫాను కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్ల పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. రోడ్లపై ఏర్పడ్డ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ములకలచెరువు నుంచి నియోజకవర్గ కేంద్రమైన తంబళ్లపల్లెకు వెళ్లే రోడ్డు మరీ అధ్వాన్నంగా మారింది. అలాగే చౌడసముద్రం - కాలువపల్లె, గూడుపల్లె క్రాస్ - కాలువపల్లె, వేపూరికోట క్రాస్ - దేవళచెరువు తదితర రోడ్లు దుస్థితికి చేరాయి. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో కనీసం రోడ్లకు మరమ్మతులు చేపట్టక పోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గుంతలకు గంపెడు మట్టి కూడా వేయించిన పాపాన పోలేదు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం వాహనదారులకు చుక్కల కన్పిస్తున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకుని రోడ్డుకు మర మ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



పాత ములకలచెరువు సచివాలయం వద్ద దుస్థితికి చేరిన రోడ్డు



చౌడసముద్రం వద్ద రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

అధ్వాన్నస్థితిలో శివపురం-తంబళ్లపల్లె రోడ్డు

పెద్దమండ్యం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలం శివపురం-తంబళ్లపల్లి తారురోడ్డు అభివృద్ధి పనులు చేస్తే తం బళ్లపల్లి మల్లయ్యకొండ పర్యాటకం మరింత అభివృద్ధి సాధించి అన్నమయ్య జిల్లా రాయచోటికి రాజమార్గంగా మారుతుంది. శివపురం- తంబళ్లపల్లి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటుతో రాయచోటి వెళ్లడానికి పడమటి మండలాలకు తంబళ్లపల్లి మార్గం కేంద్ర బిందువుగా మారింది. దీంతో వాహనాలలో రాయచోటికి వెళ్లడానికి అనువైన రోడ్డు మార్గం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చూస్తున్నారు. తంబళ్లపల్లి కొండపై వెలసి ప్రసిద్ధి చెందిన భ్రమ రాంభికమల్లికార్జున స్వామి దర్శనంతో పాటు, మహాశివరాత్రి వేళల్లో ప్రత్యేక పూజల కోసం కాలినడకన శివపురం నుంచి నేలమ ల్లయ్య మార్గంలో కొండకు దిగువ తూర్పు భాగంలో వెలసిన నేల మల్లయ్య స్వామిని దర్శనం చేసుకొని తంబళ్లపల్లి మల్లయ్యకొండ పైకి భక్తులు వెళ్తారు. శివపురం- తంబళ్లపల్లి ఈ మార్గం అభి వృద్ధి చెందితే శివపురం నుంచి నేలమల్లయ్య స్వామి దక్షిణ భాగం నుంచి కేవలం 12 కిలోమీటర్ల దూరంలో తంబళ్లపల్లికి చేరుకుంటారని ఈ ప్రాంతప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణ కాశీగా పేరు పొందిన తంబళ్లపల్లి మల్లయ్య కొండను పర్యటక కేంద్రం తీర్చిదిద్దాలని గత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు సమా చారం. అటు అన్నమయ్య జిల్లా కేంద్రంకు, ఇటు తంబళ్లపల్లి పర్యాటక కేంద్రంకు అనుకూలంగా శివపురం మార్గం మరింత అభివృద్ధి సాధిస్తుందంటున్నారు. పెద్దమండ్యం, గుర్రంకొండ, గాలి వీడు, చిన్నమండ్యం ప్రజలు తంబళ్లపల్లికి వెళ్లాలంటే ఈ మార్గం అనువుగా ఉంటుంది. కాగా తంబళపల్లి నియోజకవర్గం లోని తంబళ్లపల్లి, బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు ప్రజలు రాయచోటికి వెళ్లాంటే తంబళ్లపల్లి వయా పెద్దమండ్యం, చిన్న మండ్యం మీదుగా పలు ఇక్కట్లతో వెళ్లాల్సి ఉంది. అధికారులు రూ. 11 కోట్లతో శివపు రం-తంబళ్లపల్లి 12 కిలోమీటర్ల మార్గం అభివృద్ధికి ప్రతిపాదన చేసినా అటవీ మార్గంలో 4. 5 కిలోమీటర్లు ఉండడంతో ప్రతిపాదన రూపుదాల్చలేదంటున్నారు. ఈ మార్గం అభివృద్ధి చెందితే ప్రజలకు అన్ని విధాల సౌకర్యంగా ఉంటుందని శివపురం సర్పంచ్ గంగులమ్మ తెలిపారు.



పెద్దమండ్యంలోని శివపురం - తంబళ్లపల్లి మట్టిరోడ్డు

గ్రామాల అభివృద్ధికే పల్లె పండుగ

వాల్మీకిపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికే పల్లె పండుగ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేప ట్టిందని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మూరేవాండ్లపల్లె, తాటిగుంటపల్లె, గంగాదొడ్డి గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్ర మాలలో ఎంపీడీవో మనోహర్‌రాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రకుమార్‌రెడ్డి, నాయకులు వల్లిగట్ల వెంకటరమణ, సురేష్‌కుమార్‌రెడ్డి, తదితర నాయకులు, అధికారులు, సర్పంచ్‌లు, ప్రజలు పాల్గొన్నారు.



వాల్మీకిపురం మూరేవాండ్లపల్లెలో పల్లె పండుగ కార్యక్రమంలో నాయకులు, అధికారులు

పల్లె పండుగలో 8 పనులకు భూమి పూజ

పీలేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గురువారం పీలేరు మండలంలో ఎనిమిది సీసీ రోడ్లకు అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు భూమి పూజ చేశారు. మండలంలోని రేగళ్లు పంచాయతీలో రూ.8 లక్షలతో మూడు సిమెంటు రోడ్లు, బాలంవారిపల్లె పంచాయతీలో రూ.5 లక్షలతో ఒకటి, ముదుపులవేములలో రూ.5 లక్షలతో రెండు పనులు, దొడ్డిపల్లె పంచాయతీలో రూ.8 లక్షలతో రెండు పనులకు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, ఉపాధి ఏపీవో మహేశ్, ఆయా పంచాయతీల్లోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



నాయనివారిపల్లెలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

కురబలకోట, అక్టోబరు 17: ప్రతి గ్రామంలో మౌలికవసతులను కల్పనే ప్రభుత్వ ధ్యేయమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముదివేడు, దాదంవారిపల్లె, తెట్టు, మట్లివారిపల్లె, నందిరెడ్డిగారిపల్లె తదితర గ్రామాలలో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటుగా అన్ని వసతులను కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగయ్య, టీడీపీ సమన్వయకర్త మల్లికార్జున నాయుడు, అయూబ్‌బాషా, డిఆర్ వెంకట్రమణారెడ్డి, వైఎస్ సురేంద్ర, రమణ, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కలకడలో: మారుమూల గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఎనుగొండపాలెం, దిగువతాండ, కదిరాయచెరువు పంచాయతీలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఇందుకు గాను రూ.12.5 లక్షలతో నాలుగు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ రహీం, చెన్నకేశవులు, సర్పంచ్ లక్ష్మీప్రసన్న, నాయ కులు శేఖర్‌నాయుడు, శ్రీనివాసులనాయుడు, విశ్వనాథంశెట్టి, గౌరవం శ్రీనివాసులు, అంజినేయులు, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌నాయక్, శ్రీధర్‌నాయక్, బొంబాయి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజలో అధికారులు, నాయకులు

టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

గుర్రంకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఆపార్టీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ అరిగెలవారిపల్లెలో గురువారం పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగు నీటి పైప్‌లైన్‌లను గుర్తించి తెలుగుదేశం పార్టీ అభివృద్ధి చేసిందన్నారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాలి

కలికిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా తుఫాను నేపథ్యంలో కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో భానుమూర్తి రావు ఆదేశించారు. గురువారం వివిధ శాఖలకు చెందిన అధికార్లతో ఆయన సమావేశం నిర్వహించి బోరు బావుల వద్ద వర్షపు నీరు ఇంకి తాగునీరు కలుషితం అయి ఉంటుందని, వెంటనే క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. మంచినీటి ట్యాంకు లను కూడా శుభ్రం చేయించాలన్నారు. దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కృష్ణా రెడ్డి, ఈవోపీఆర్డీ పరశురామ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



క్షేత్ర స్థాయి అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో భానుమూర్తిరావు

నట్టల నివారణకు ఉచిత మందు పంపిణీ

కలికిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలు తదితర జీవాల్లో సోకే నట్టల వ్యాధి నివారణకు ఉచితంగా మందు సరఫరా చేస్తున్నట్లు కలికిరి పశు సంవర్ధక శాఖ ప్రాంతీయ వైద్య శాల సహాయ సంచాలకుడు వెంకటముని నాయుడు తెలిపారు. గురువారం మర్రికుంటపల్లె పంచాయతీలోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును తాగించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకూ మండలంలో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని, జీవాల యజమానులు ఉచితంగా అందజేసే ఈ మందును వినియోగించుకోవాలని కోరారు. వర్షాల కారణంగా జీవాలకు సోకే వివిధ రకాల జబ్బులకు ఇంజెక్షన్లు కూడా వేయడం జరుగు తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రెడ్డిరాము, పశు వైద్య సిబ్బంది ఇలియాజ్, అనిల్, పవన్ ఇతర రైతులు పాల్గొన్నారు.

ఆలయం కూల్చేసిన దుండగులను శిక్షించాలి

ములకలచెరువు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కనుగొండ అటవీ ప్రాంతంలోని అభయాంజనేయస్వామి ఆలయాన్ని కూల్చివేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని టీఎన్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీడీపీ నేత కట్టా దొర స్వామినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా పేర్కొన్నారు. కనుగొండలో కూలిపోయిన ఆలయాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల మనోభావాలను దెబ్బతీసే వి ధంగా ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం దారుణమన్నారు. బాధితులు ఎంతటివారైనా వదలిపెట్టమన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీరియస్‌గా తీసుకుని నిందితులకు శిక్షపడేలా పోలీస్‌శాఖకు ఆదేశాలు జారీ చేశార న్నారు. వారి వెంట నేతలు తోట గిరిధర్, చెన్నకిష్టా, కేశవులు, మండల ప్రధాన కార్యదర్శి వెంకట స్వామి, నాయ కులు ఆదినారాయణ, గొడ్డుమూరు రవి, నారాయణ, నాగేంద్ర, సోమశేఖర్, ఉమా శంకర్, శివన్న, శంకర, సూరి, నారాయణస్వామి పాల్గొన్నారు.



కూల్చివేతకు గురైన ఆలయాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు దొరస్వామినాయుడు, పాలగిరి సిద్ధా

నిత్యావసర సరుకుల ధరల భారాన్ని అరికట్టండి

మదనపల్లె అర్బన్, అక్టోబరు17:(ఆంధ్రజ్యోతి) పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డి మాండ్ చేశారు. గురువారం స్థానిక సంతగేటులోని ఏఐ టీయూసీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల కారణంగా పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుమల, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మురళి, తదితరలుఉ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

వైభవంగా నల్లగంగమ్మ విగ్రహ పతిష్ఠ

నిమ్మనపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని స్థానిక పంచాయతి నాగులయ్యగారిపల్లిలో గురువారం నల్లగంగమ్మ విగ్రహ పతిష్ఠ ను గ్రామస్థులు భక్తి శ్రద్ధల తో వైభవంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలిసి మండల టీడీపీ నాయ కులు హాజరై అమ్మవారని ద ర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీక రించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తిభావం కలిగి ఉంటేనే భావితరాల మనుగడ బాగుంటాయని అన్నారు. గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామానికి సీసీరోడ్డు, మురుగునీటి కాలువలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన త్వరలోనే సీసీరోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, ఆర్టైవెంకటేష్, రాజన్న, మల్లప్ప, శంకర, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం ఆలయంలో గురువారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం అభయాంజనేయస్వామికి ఆకుపూజ, సింధూరపూజ, తోమాల, వడమాల సేవలు పూర్తిచేసి పున్నమి వెలుగులో విశేష భక్తజనం నడుమ పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రత వేడుకలు జరిగాయి. అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి

మదనపల్లె అర్బన్, అక్టోబరు17:(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, బసినికొండ పంచాయతీ, శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ వద్ద రైతు రమణయ్యకు చెందిన రెండు ఆవులు కరెంటు షాక్‌తో అక్కడికి అక్కడే చనిపోయాయి. వర్షానికి విద్యుత్ స్తంభానికి కరెంటు సప్లయ్ కావడంతో ఈ సంఘటన జరిగినట్లు రైతు వాపోయాడు.

ములకలచెరువు ట్రాన్స్‌కో ఏడీగా గోవిందరెడ్డి

ములకలచెరువు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ట్రాన్స్‌కో ఏడీగా గోవిందరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మదనపపల్లె ట్రాన్స్‌కో ఏఈగా పనిచేస్తున్న ఆయన్ను పదోన్నతిపై ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏడీగా పనిచేస్తున్న రుక్మాంగదబాబు పదివీ విరమణ చేశారు.

ఎస్పీడీసీఎల్ ఈస్ట్ ఏఈగా కుమార్‌బాబు

మదనపల్లె టౌన్, అక్టోబరు 17: మదనపల్లె ఎస్పీడీసీఎల్ ఈస్ట్ సెక్షన్ ఏఈగా కుమారబాబు బాధ్యతలు చేపట్టారు. గురువారం స్థానిక ఈస్ట్ సెక్షన్ కార్యాలయంలో ఏఈగా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా ఇక్కడ ఏఈగా పనిచేసిన రెడ్డికుమార్ పదోన్నతిపై రాయచోటికి బదిలీ అయ్యారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

నిమ్మనపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాల న పాటించాలని డీఎల్‌డీవో అమరనా థ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మం డలంలోని కొండయ్యగారిపల్లి సచివాల యాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిం దని వాటిని నిర్విరామంగా పూర్తి చేసేందకు ఉద్యోగులు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం హాజరు పట్టికతో పాటు రికార్డులను పరిశీలించి సమయాన్ని వృథా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, ఏవో రమేష్ మాజీ సర్పంచ్ రఫి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో అమరనాథ్‌రెడ్డి

వాల్మీకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

మదనపల్లె అర్బన్/టౌన్, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి) వాల్మీకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మదనపల్లె పట్టణంలో ఆదికవి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఏపీ వాల్మీకి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డు ఎదుట వాల్మీకి చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే ఎం. షాజహాన్‌బాషా తోపాటు టీడీపీ నా యకులు, బీజేపీ రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, మదనపల్లె పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, బీజేపీ సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి పాల్గొని వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంతకుముందే వాల్మీకి సంఘ నాయకులు ఎమ్మె ల్యే షాజహాన్‌బాషాను దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని, నివేదిక వచ్చిన వెంటనేసమస్య తీరుతుందన్నారు. వాల్మీకులకు అర్హత కలిగిన వారికి 200 ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వాల్మీకి వీధి సర్కిల్‌లో వాల్మీకుల కోసం కమ్యునిటీ హాల్ ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు సుదర్శన బాబు, శంకర, ముత్తురాశి హరికృష్ణ, బొగ్గిటి కృష్ణమూర్తి, విజయమోహన్, చిప్పిలి చంద్రాయప్ప, చీలకబైలు సర్పంచ్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ రెడ్డెప్ప, పులిశ్రీనివాసులు, పూల కుంట్ల హరి, కొత్తఉడుము శంకర, మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మీ పద్మావతమ్మ, రాధమ్మ, ఎమార్పీఎస్ నాయకుడు నరేంద్రబాబు, టీడీపీ నాయకులు నాదేళ్ల విద్యాసాగర్, కమలమర్రి కృష్ణ, జేసీబీ మధు, వేణు, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, బిల్డర్ రామకృష్ణ, కోనభాస్కర, బీజేపీ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, విజయభారతీ సేతు, రవికుమార్, కోసూరి భవానీ పాల్గొన్నారు. మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీనాయకుడు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో చిత్తూరు బస్టాండ్ లోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మీనాకుమారి, నాయకులు ఖాదర్‌బాషా, ముబారక్‌ఖాన్, ఈశ్వరమ్మ, సోముశేఖర్, రవీంద్ర, మహబూబ్‌పీర్, మహమ్మద్‌అలీ, నాగరాజ, ఖాసీం, వల్లి పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలో: రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహిస్తుండడంతో పలుచోట్ల అధికారులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆర్‌క్రిష్ణవేణి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రంకొండలో: వాల్మీకి జయంతి వేడుకలను కూటమి నాయకులు తరిగొండలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

కురబలకోటలో: వాల్మీకులను ఎస్టీజాబితాలో చేర్చాలని వాల్మీకిబోయ సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంగళ్లు మూడురోడ్ల కూడలిలో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లికార్జున నాయుడు, రామ్మూర్తి, అయూబ్‌భాషా, నరసింహులు, గోపాల్ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పీటీఎంలో తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి పాల్గొని వాల్మీకీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వాల్మీకీ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం మంచి పరిణామమన్నారు. నరసిం హులు, ఎనమల వెంకటేష్ వాల్మీకీ, గంగాద్రి, మాజీ సర్పంచ్ నరసింహులు, మాజీ ఎంపీటీసీ శేషాద్రి సురేష్‌బాబు, పాలగిరి రామాంజులు, స్కూల్ కమిటీ చైర్మెన్ రాము, ఐటీడీపీ సాయి, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ (చిన్నా), వెంకటరమణ, భజంత్రి రామచంద్ర, హఫీజ్ పాల్గొన్నారు.



పీటీఎంలో వాల్మీకీ జయంతి సందర్బంగా కేక్‌ను కట్ చేస్తున్న జయచంద్రారెడ్డి

పీలేరులో: వాల్మీకి మహర్షి జయంతిని పీలేరు మండల విద్యాశాఖాధికారులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంఆర్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-1 లోకేశ్వర రెడ్డి మాట్లాడుతూ మహాకావ్యమైన రామాయాణాన్ని అందించిన వాల్మీకి మహర్షి జీవితం అందరికీ ఆదర్శన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 పద్మావతమ్మ, సీఆర్‌పీలు మురళీధర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: స్థానిక బస్టాండు కూడలిలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహిచారు. ఈ సంధర్బంగా బీసీ సాధికారత సమితి జిల్లా అధ్యక్షులు లక్ష్మన్న, వెంకటక్రిష్ణలు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెంకట రమణ, ఆర్టైవెంకటేష్ సుదాకర్‌రావు, గోపాలక్రిష్ణ, చంద్రశేఖర్, మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: స్థానిక ఎమ్మార్సీలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో త్యాగరాజు వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు నివాళుర్పించారు. కార్యక్రమంలో ఐటీఐ టీవో నాగరాజు, ఇన్‌స్ట్రక్టర్లు రమణ, సురేంద్ర, చౌడప్ప, సీఆర్పీ సుధాకర్, టీచర్ వెంకటకుమార్, ఎంఆర్సీ సిబ్బంది శ్రీనివాసులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: మండలంలోని చౌడసముద్రంలో గురువారం వాల్మీకి జయంత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వాల్మీకి సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బుర్రా రమణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు శంకర, నాయకులు రామాంజులు, వెంకటేష్, పెద్దరెడ్డెప్ప, నరసింహులు, సూరి, నాగరాజు, నాగమల్లు, చిన్నరెడ్డెప్ప, బయన్న, నాగమల్లు, టీడీపీ నాయకులు చాంద్‌బాషా పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: మండలం వ్యాప్తంగా గురువారం వాల్మీకి జయంతి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో తొలుతగా స్థానిక పట్టాభిరామాలయంలో వాల్మీకి మహర్షి విగ్రహానికి అభిషేకం, నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక పాత టమోటా మార్కెట్ వద్ద నుంచి పుష్పపల్లకిలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాలలో వాల్మీకి సంఘం నాయకులు విష్ణుచైతన్య, రెడ్డెప్ప, టైలర్ రాజు, శ్రీనాథ్, ప్రసాద్, భరత్, రామచంద్ర, రాజేష్, శంకర, పునుగుపల్లె రెడ్డి, రంజిత్‌కుమార్, రమణ, ఫణికుమార్, శివశంకర్ పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: వాల్మీకి మహర్షి జయంతిని మండలంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఎంపీడీవో , నగరపంచాయతీ , ఎమ్మార్సీలలో వాల్మీకి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరపంచాయతీ కమిషనర్ పల్లవి, ఎంపీడీవో శంకరయ్య, వాల్మీకిసంఘ నాయకులు చావిడికిట్టన్న, ప్రకాష్, నక్కామహేష్ తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సాధనకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మండల కేంద్రంలో వాల్మీకి జయంతి వేడుకలలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్‌మోహన్, రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, స్టేట్ యూత్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, బోయవీధి రమణ, వాల్మీకి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



చిత్తూరుబస్టాండ్ సర్కిల్‌లో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తహసీల్దారు కార్యాలయం జడ్పీ గెస్ట్‌హౌస్‌లోకి మార్పు

తంబళ్లపల్లె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల కేంద్రంలో ఉన్న తహసీల్దారు కార్యాలయాన్ని జిల్లా పరిషత్ విశ్రాంతి భవనములోకి మార్పు చేస్తున్నట్లు తహసీల్దారు హరికుమార్ తెలిపారు. తుఫాను కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కార్యాలయంలోని గదులన్నీ తడిచిపోయి, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యిందన్నారు. దీంతో సిబ్బందికి, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా జిల్లా కలెక్టరు, సబ్ కలెక్టరు ఆదేశాల మేరకు తహసీల్దారు కార్యాలయాన్ని తాత్కాలికంగా మండల కేంద్రానికి సమీపంలోని ద్వారకానగర్‌లో ఉన్న జిల్లా పరిషత్ విశ్రాంతి భవనంలోకి మారుస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తహసీల్దారు కోరారు.

లోతట్టు ప్రాంతాలలో డ్రోన్లతో సర్వే

మదనపల్లె, అక్టోబరు 17: మదనపల్లె పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం డ్రోన్లతో సర్వే చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల పేర్కొన్నారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కలెకర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు పట్టణంలోని బుగ్గకాలువ, బాపన కాలువ, కురవంక, రామ్‌నగర్, తదితర ప్రాంతాల్లో డ్రోన్లతో ఫొటోలు, వీడియోలు తీసినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడైనా వర్షపునీరు నిల్వ ఉన్నా..ఇళ్లలోకి ప్రవేశించాయో తెలుసుకోవడానికి ముందస్తు చర్యల్లో భాగంగా రెండు డ్రోన్లతో సర్వే చేసినట్లు చెప్పారు. ఇప్పటికైతే పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఎక్కడా కనిపించలేదని, వర్షాలు మరింత బలపడితే, ఈ అవకాశం ఉండొచ్చని కమిషనర్ వివరించారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్, సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్ ఆదేశాల మేరకు వరదలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నట్లు ఆమె స్పష్టం చేశారు.

ఈ సారైనా మండల సమావేశం జరిగేనా..?

కురబలకోట, అక్టోబరు 17: కురబలకోట మండల సర్వసభ్య సమావేశం ఈ సారైనా సజావుగా జరిగేనా..? లేక మళ్లీ వాయిదా పడేనా? అని పలువురు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలి మండల సమావేశాన్ని నిర్వహించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. అయితే గత మూడు నెలల క్రితం మండల సమావేశం నిర్వహించగా ఎంపీటీసీ సభ్యులు ఎవ్వరూ హాజరుకాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. ఇలా రెండు సార్లు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో అధికారులు మళ్లీ ఈ నెల 18న సమావేశం నిర్వహించడానికి చర్యలు చేపట్టడంతో ఈ సమావేశమైనా జరుగుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.